J/NELLORE/003/21-23 R.N.I.No.25359/74 పేజీలు : 12

THE BEST TELUGU WEEKLY OF NELLOREANS




# లాయర్

సంపుటి : 41 సంచిక : 09 6.8.2021, శుక్రవారం వెల : రూ. 5 /- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## జగన్ పథకాలతో..

# ప్రతిపక్షాలకు పక్షవాతం





**పక్షవాతం అంటే కాలు, చెయ్యి, నోరు పడిపోతాయి. శరీరం పాక్షికంగా పనిచేస్తుంది. ప్రస్తుతం ఆంధ్రాలో ప్రతిపక్షాల పరిస్థితి అలాగే వుంది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న పథకాల ద్వారా ఆయన ప్రభుత్వానికి, తద్వారా ఆయన పార్టీకి పెరుగుతున్న ఆదరణ చూసి ప్రతిపక్షాలవారికి నోళ్ళు పెగలడంలేదు, చేతులూ కాళ్ళూ ఆడడంలేదు.**

175 సీట్లకు గాను కేవలం 24 సీట్లలోనే ఇతర పార్టీలు గెలిచాయి. వాటిలో 23 తెలుగు దేశానివైతే ఒకటి జనసేనది. ఇప్పుడు ఆ 23లో 20 మందిదాకా వైసిపి గూటికి రావడానికి సిద్ధంగా ఉన్నారని రాజకీయవర్గాల సమాచారం. ఇక మిగిలేది బావబామ్మర్దులు మాత్రమే. జనసేనలో గెలిచిన ఒకే ఒక వీరుడు కూడా ఎప్పుడో ఆ పార్టీకి సలాంకొట్టి జగన్ పక్కన చేరిపోయాడు.


ప్రతి విషయాన్నీ భూతద్దంలో చూపి గోరంతను కొండంత చేసి జగన్‌మోహన్‌రెడ్డిని అభాసుపాలు చెయ్యడానికి తెలుగుదేశం చేస్తున్న ప్రయత్నాలన్నీ వృధా అవుతున్నాయి. దివంగత నేత డాక్టర్ రాజశేఖరరెడ్డి పదేపదే చెప్తుండిన విశ్వసనీయత అన్న పదమే తెలుగుదేశం డిక్షనరీలో కనపడడంలేదు. ఉన్న ఒక్క నాయకుడూ ముసలోడైపోయాడు, వారసుడు వాయిస్ లేని వాడిగా మిగిలిపోయాడు. సమగ్ర నాయకత్వం లేకపోవడంతో పార్టీలోని ఇతర నాయకులతో పాటు క్యాడర్ కూడా నీరసపడిపోయారు.

రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ ఊసే లేదు. సోనియాగాంధీ చేసిన పనికిమాలిన పని పుణ్యమా అని ఆంధ్రాలో కాంగ్రెస్‌పార్టీ అడ్రస్ గల్లంతైపోయింది. అసలు కాంగ్రెస్‌పార్టీ అనేది ఒకటి ఉండేదన్న సంగతి కూడా ప్రజలకు గుర్తు రానంత హీన స్థాయికి ఆ పార్టీ పడిపోయింది.

భారతీయ జనతా పార్టీ కొంచం ఆగం చేస్తున్నప్పటికీ ఆ పార్టీ స్టాండ్ ఏమిటో అర్థం కాక పార్టీ శ్రేణులు అయోమయంలో ఉన్నారు. నిత్యం మతతత్వంపైన మాట్లాడుతున్నారు తప్ప మిగిలిన విషయాలపైన ఫోకస్ పెట్టడంలేదు. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులు, తరలిపోతున్న పరిశ్రమలు, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వంటి వ్యవహారాలలో వారి వాణి పెద్దగా ప్రతిధ్వనించడంలేదు. ముఖ్యంగా రాబోయే రోజులలో జగన్ పార్టీ విషయంలో కేంద్ర బిజెపి నిర్ణయం ఎలా ఉంటుందోనన్న అనుమానం కూడా చాలామంది కమలం పార్టీ నాయకులలో లేకపోలేదు. ఇలాంటి సందిగ్ధంలో అధికార పార్టీ పైన ఘాటైన విమర్శలు చేయడంలో భాజపా వెనకడుగు వేస్తుందనడంలో సందేహం లేదు.









పవర్‌స్టార్ పార్టీ విషయానికొస్తే... జనం లేరు, సేన అసలే లేదన్న విషయం 2019 ఎన్నికలతోనే స్పష్టమైపోయింది. పవన్‌కళ్యాణ్ ప్రసంగాలలో

10లో



# సమస్యల సుడిలో ఆక్వా పరిశ్రమ

- కేంద్రానికి విన్నవించిన బీద మస్తాన్‌రావు బృందం
- ఇబ్బందులు తీరుస్తామన్న కేంద్రమంత్రులు



ఆక్వా పరిశ్రమ సమస్యల సుడిగుండంలో పడి కొట్టుమిట్టాడుతోందని, కేంద్ర ప్రభుత్వం వెంటనే చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించాలని రొయ్యల మేత తయారీదారుల సంఘం అధ్యక్షులు బీద మస్తాన్‌రావు ఢిల్లీలోని పలువురు కేంద్ర మంత్రులను, ఉన్నతస్థాయి అధికారులను కలిసి విన్నవించారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రులు సమస్యలు తీరుస్తామంటూ హామీ ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల బీద మస్తాన్‌రావు, సముద్ర ఉత్పత్తుల ఎగుమతుల సంఘం అధ్యక్షులు ఇంద్రకుమార్, రొయ్యల మేత తయారీదారుల సంఘం కార్యదర్శి గులరేజ్ ఆలం, రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ తదితరులంతా ఒక బృందంగా ఏర్పడి ఢిల్లీలో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్, సహాయక మంత్రి డాక్టర్ ఎల్ మురగన్‌లతో పాటు వైకాపా పార్లమెంటరీ ప్రతినిధి విజయసాయిరెడ్డిలను కలిసి ఆక్వా పరిశ్రమ కష్టాలను వివరించారు. సోయా డి-ఆయిల్ కేక్ (డిఓడి) అనేది రొయ్యలకు, చేపలకు ప్రధానమైన ఆహారమని, అయితే దాని ధర గత జనవరిలో మెట్రిక్ టన్నుకు 31 వేల నుంచి జులై నాటికి జీఎస్టీతో కలిపి 95వేల రూపాయలకు చేరుకున్నాయని, దీంతో స్టాక్‌హోల్డర్లు సోయా విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టించి అక్రమంగా నిల్వ చేసుకుంటున్నారని బీద మస్తాన్‌రావు కేంద్రమంత్రుల దృష్టికి తీసుకువెళ్ళారు. సోయా ధరలు విపరీతంగా పెరుగుతుండడంతో రొయ్యల మేత ధరను పెంచడం అనివార్యమవుతోందన్నారు. దీనివల్ల రొయ్యల ఉత్పత్తి రైతులకు ఆర్థికంగా లాభదాయకం కాదని అంటూ, కోవిడ్ ఇతర అంతర్జాతీయ ఆంక్షల కారణంగా ఎగుమతులు కూడా బాగా తగ్గిపోవడం వల్ల రొయ్యల ధరలు అందుకనుగుణంగా పెరగడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో 1.60 లక్షల హెక్టార్లలో రొయ్యల సాగు జరుగుతోందని, ఆక్వాకల్చర్ ఎగుమతులు సంవత్సరానికి సుమారు 47వేల కోట్ల విదేశీమారక ఆదాయాన్ని సంపాదిస్తాయని, లక్షకు పైగానే ఉన్న రొయ్యల రైతులు, మరో అయిదు లక్షల మంది దాకా కార్మికులు రొయ్యల పెంపకంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని, వీరు కాక హేచరీలు, ఫీడ్‌మిల్లులు, రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లలో మరో 2 లక్షలమంది దాకా ఆక్వా పరిశ్రమపై జీవిస్తున్నారని ఆయన వివరించారు. ఇక్కడ నుంచి ఎగుమతి అవుతున్న రొయ్యలు కలుషితమయ్యాయనే కారణంతో ఇటీవల చైనా వందలాది కంటైనర్ల రొయ్యలను తిరస్కరించిందని, కోవిడ్ నేపథ్యంలో దురదృష్టవశాత్తు రొయ్యల ఫీడ్ (మేత) ధరల పెరుగుదల రొయ్యల పరిశ్రమపై తీవ్రమైన ప్రభావం చూపుతోందని తెలిపారు. మరో 15 లక్షల మంది రైతులు చేపల పెంపకంతో జీవనం సాగిస్తున్నారని ఫీడ్ ధర పెరగడంతో చేపల ధర కూడా పెరుగుతోందని తెలిపారు. ఈ సమస్యలన్నిటినీ ప్రధానికి, పశు సంవర్థక, డెయిరీ, మత్స్యశాఖల మంత్రికి కూడా వివరించామని, వాణిజ్యమంత్రిత్వ శాఖ జోక్యం చేసుకుని కనీసం 15 లక్షల మెట్రిక్ టన్నుల సోయా మేతను దిగుమతి చేసుకునేందుకు అనుమతించాలని కోరివున్నామన్నారు. అయితే ఇప్పటిదాకా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని కేంద్రమంత్రులకు తెలియజేశామన్నారు. సంక్షోభంలో కూరుకుపోతున్న ఆక్వా పరిశ్రమను వెంటనే గట్టెక్కించాలని కోరగా, అందుకు స్పందించిన కేంద్రమంత్రులు సోయా దిగుమతిపై వెంటనే తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారని బీద మస్తాన్‌రావు పేర్కొన్నారు.

# ఆత్మకూరు కమిషనర్ ఆదర్శం

## రక్తదానం చేసి.. దాతలకు ప్రోత్సాహం



రక్తదానం చేసి బాధితులను ఆదుకోవాలంటూ చెప్పడమే కాక తాను స్వయంగా రక్తదానం చేసి రక్తదాతలకు ఉత్సాహాన్ని ప్రోత్సాహాన్ని అందిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు ఆత్మకూరు మునిసిపల్ కమిషనర్ రమేష్‌బాబు. ఈనెల 1న ఆయన చిత్తూరుజిల్లాలోని శ్రీకాళహస్తిలో యువతరం సేవాసమితి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పాల్గొని స్వయంగా రక్తదానం చేసి రక్తదానం చేయడం పట్ల దాతలను ప్రోత్సహించారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రస్తుత కరోనా పరిస్థితుల్లో రక్తనిల్వలు తగ్గిపోవడంతో బాధితులకు అవసరమైన రక్తం అందక అనేక బాధలు పడుతున్నారని, ప్రతిఒక్కరూ రక్తదానం చేసి బాధితులను ఆదుకోవాలని ఆయన అందరికీ విజ్ఞప్తిచేశారు. గతంలో తాను శ్రీకాళహస్తి మునిసిపల్ కమిషనర్‌గా ఉన్నప్పుడు సేవా కార్యక్రమాల్లో ముందుంటూ ఇక్కడి యువత ఎంతో సహకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎస్ఆర్‌జెడి కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సిరిమామిళ్ళ వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

# మన బస్సులు తడ వరకే

కరోనా నేపథ్యంలో చెన్నైలో ఈనెల 8వ తేది వరకు కర్ఫ్యూ అమల్లో ఉందని, అందువల్ల నెల్లూరు నుంచి చెన్నైకి వెళ్ళే బస్సులను తడ దాకా మాత్రమే నడుపుతామని ఆర్టీసి ఆర్ఎం శేషయ్య ఈనెల 2న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెన్నైకి వెళ్ళేవారు తడ దాకా మన బస్సుల్లో వెళ్ళి, అక్కడ నుంచి చెన్నై బస్సుల్లో ఎక్కి చెన్నైకి వెళ్ళవచ్చని ఆయన సూచించారు.

## ఎయిడ్స్ బాధితులకు..
# పూర్వ విద్యార్థుల అన్నదానం

స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 1న బోగోలు మండలంలోని ముంగమూరు ఎయిడ్స్ ఆదరణ కేంద్రంలోని అభాగ్యులకు విశ్వనాథరావుపేట జడ్పీ హైస్కూలు 1985-86 పూర్వవిద్యార్థులు ఆహారపొట్లాలు అందజేసి తమ సేవాభావం చాటుకున్నారు. పూర్వ విద్యార్థులు బత్తుల రవిచంద్ర, సాల్మన్‌రాజు, శంకర్‌నాయుడు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# కరోనాతో.. జాగ్రత్త

**- బంగారుపేట వైద్యాధికారి పల్లవి**

కరోనా తీవ్రత ఇంకా తగ్గలేదని, ప్రజలు ఆ మహమ్మారి వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రభుత్వ నియమనిబంధనల మేరకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వెంకటగిరి నియోజకవర్గంలోని బంగారుపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి పల్లవి ప్రజలకు సూచించారు. ఈనెల 1న వైద్య కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కోవిడ్‌కు దూరంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ కోవిడ్ టీకా వేయించుకోవాలన్నారు. మరోవైపు ఈ వర్షాకాల సీజన్‌లో సాధారణ సీజన్ వ్యాధులు కూడా ప్రబలిపోయే అవకాశం ఉందని, ప్రజలు వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల ఆరోగ్య పరీక్షలను ఉచితంగానే నిర్వహిస్తున్నారని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.



## ఈ కష్టాల సేద్యం..
# చేయలేం బాబోయ్

## ➲ అధికధరలతో అన్నదాతల బెంబేలు

***జిల్లాలో అనేకమంది బీదాబిక్కి, మధ్యతరగతి రైతులు రోజురోజుకు పెరుగుతున్న ధరలతో బెంబేలెత్తిపోతున్నారు. ఈ కష్టాల సేద్యం తాము చేయలేకున్నామంటూ ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంటలు వేసుకుందామంటే పొలాలను దుక్కిదున్నుకోవాలన్నా కష్టంగా ఉందని రైతులు ఆందోళనతో ఉన్నారు.***

ముఖ్యంగా జిల్లాలోని మెట్టప్రాంత రైతులకు ఈ ధరల పెరుగుదల పెద్ద భారంగా ఉంటోంది. ఒకవైపు ఎరువుల ధరలు, మరోవైపు డీజల్, పెట్రోలు ధరలు భారీగా పెరిగిపోతుండడంతో వ్యవసాయ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. కూలిరేట్లు కూడా గతంలో కంటే భారీగా పెరిగిపోయాయి. పోయినసారి సీజన్‌లో ఉన్న ధరలకంటే ఇప్పుడు రెండింతలు పెరగడంతో ఈ అదనులో పంటలు పండించి చేసిన అప్పులు తీర్చుకుందామనుకున్న సామాన్యరైతులకు ఈ ధరల పెరుగుదల పెద్ద భారంగా ఉంటోంది. జిల్లాలో ఇటీవలి కాలంలో ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేసేందుకు రైతులు ఎంతో ఆసక్తిచూపుతుండడం విశేషం. ట్రాక్టర్‌లు, కోతయంత్రాలు వగైరాలను బాగానే వినియోగిస్తున్నారు. అయితే వీటి ధరలు కూడా ఆకాశానికి అంటుతుండడంతో మళ్ళీ పాతపద్ధతులే మేలన్నట్లుగా భావించే స్థితి వచ్చేస్తోంది. ట్రాక్టర్‌లు అద్దెకు తెచ్చి దుక్కులు దున్నుకోవాలంటే గతంలో కంటే కూడా ఎక్కువ రేటు చెల్లించాల్సి వస్తోంది. వ్యవసాయాన్నే నమ్ముకుని జీవిస్తున్న రైతాంగానికి మండుతున్న ధరలతో ఈసారి మరెంతో కష్టంగా ఉంది. జిల్లాలో కురుస్తున్న వర్షాలతో పాటు సోమశిల, కండలేరు జలాశయాల్లో నీళ్ళు పుష్కలంగా ఉన్నాయని, ఈ సీజన్‌లో పంటపొలాలకు సాగునీటికి ఇబ్బంది లేదని సంతోషిస్తున్న తరుణంలో సేద్యం ఖర్చులు మాత్రం అంతకంతకు పెరిగిపోతుండడంతో పంటలు వేసుకోవాలా.. వద్దా అనుకుంటూ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో రైతులు తర్జనభర్జనలు పడుతున్నారు. ఎంత కష్టపడి వ్యవసాయం చేసినా చివరికి చేసిన కష్టానికి తగ్గ ఫలసాయం ఉంటుందో లేదో తెలియని పరిస్థితి. ఆరుగాలం శ్రమించి పంటలు పండించుకుంటున్నా చివరికి గిట్టుబాటు ధర చేతికి వచ్చే దాకా ఆందోళనే. ఈలోగా ఏ ప్రకృతి విపత్తులు వచ్చి పంటలు మునిగిపోతాయో తెలియదు. అన్ని కష్టనష్టాలను తట్టుకుని ధైర్యం చేసి పంటలు సాగుచేసుకుంటున్న రైతుల సమస్యల పట్ల ప్రభుత్వాలు స్పందించి వారిని అన్నివిధాలా ఆదుకోవాల్సి ఉంది. ముఖ్యంగా ఎరువులపై సబ్సిడీని పెంచి ఆదుకోవాలి. అదేవిధంగా పెట్రో ధరల నియంత్రణకు ప్రభుత్వాలు చొరవతీసుకోవాల్సి ఉంది.

# శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరునికి 'ఆడికృత్తిక' పూజలు



ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ మల్లికార్జున కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో కొలువై ఉన్న శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ఆడికృత్తిక సందర్భంగా ఈనెల 2న ఆలయ అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. స్వామివార్లను శోభాయమానంగా అలంకరించి నెమలివాహనంపై ఊరేగించారు. కోవిడ్ నిబంధనల మేరకు కొద్దిమంది భక్తులతో ఆలయం చుట్టూతా ప్రదక్షణలు చేసి స్వామివారికి ప్రాకారోత్సవం నిర్వహించారు. దేగపూడి మల్లికార్జున్‌రెడ్డి దంపతులు, చిట్టమూరు వెంకటరెడ్డి దంపతులు ఈ వేడుకకు ఉభయకర్తలుగా వ్యవహరించగా, ఆలయ ఇ.ఓ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

# గురుకులాల్లో 5వ తరగతి సీట్ల భర్తీ

జిల్లాలోని గురుకుల పాఠశాలల్లో 2021-22 విద్యా సంవత్సరానికి సంబంధించి అయిదో తరగతి సీట్లకు ఎక్కువమంది దరఖాస్తు చేసుకోవడంతో ఆ సీట్లను లాటరీ ద్వారా భర్తీ చేశారు. విజయవాడలోని రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి కార్యాలయంలో ఈనెల 1న లాటరీ ప్రక్రియ నిర్వహించారని, దీంతో అయిదో తరగతి సీట్లను భర్తీ చేశామని గురుకులాల జిల్లా కన్వీనర్ కొండలరావు తెలిపారు. కోటలోని గురుకుల పాఠశాలలో 80 మంది బాలురకు, దొరవారిసత్రంలో 80 మంది బాలురకు, గొలగమూడిలో 80 మంది బాలికలకు, నార్త్ ఆములూరు గ్రామంలో 40 మంది బాలికలకు, గూడూరులో 40 మంది బాలికలకు సీట్లు లభించాయన్నారు. ఈనెల 11వ తేదిలోగా వారు ఆయా గురుకుల పాఠశాలల్లో అడ్మిషన్‌లు పొందాలని తెలిపారు.



ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, సాహితీవేత్త, ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ఉత్తరప్రదేశ్ మాజీ గవర్నర్ కీ။శే။ డా. బెజవాడ గోపాలరెడ్డి 114వ జయంతిని పురస్కరించుకుని ఆగస్టు 5వ తేదీ గురువారం ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న విజయ డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి

## నెల్లూరు నగరంలో 'లాక్‌డౌన్'

కరోనా మూడవ దశ క్రమేణా పెరుగుతున్న తరుణంలో ముందుజాగ్రత్త చర్యగా ఇప్పటికే జిల్లాలో పలు మండలాల్లో జిల్లా యంత్రాంగం లాక్‌డౌన్ విధించింది. నెల్లూరు నగరంలో సైతం ఆగస్టు 6వ తేదీ నుండి ఈ లాక్‌డౌన్ అమలులోకి వస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకే దుకాణాలు పనిచేయాలని ప్రభుత్వ శాఖలు ఆదేశించాయి. మందులషాపుకు, మందు(వైన్) షాపులకు మాత్రమే మినహాయింపుంటుందని తెలిపాయి. కేసుల తీవ్రత స్థాయి పెరగనప్పటికీ ముందు జాగ్రత్త చర్యగా అప్రమత్తమైనట్లు తెలుస్తోంది.



## తెలంగాణ మంత్రి కెటిఆర్‌తో ఫిక్కీ తెలంగాణ కౌన్సిల్ కో-ఛైర్మన్ ఆదాల మురళీకృష్ణారెడ్డి భేటీ

అంతర్జాతీయ స్థాయి సంస్థలను ఆకర్షిస్తూ శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాదు నగరంతో పాటు తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని కూడా విశవ్యాప్తం చేసే కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం పావులు కదుపుతోంది. ఇందులో భాగంగా 'ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ చాంబర్స్ అఫ్ కామర్స్ & ఇండస్ట్రీ'(ఫిక్కీ) సభ్యులని ప్రభుత్వం భాగస్వాములను చేస్తోంది. పై సందర్భాన్ని పురస్కరించుకుని తెలంగాణ మునిసిపల్ మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు ఫిక్కీ తెలంగాణ కౌన్సిల్ కో-ఛైర్మెన్ మరియు మాక్ గ్రూప్ ఛైర్మెన్ ఆదాల మురళీకృష్ణారెడ్డి ఇటీవల హైదరాబాదులో సమావేశమయ్యారు. 2022లో దుబాయిలో జరగనున్న దుబాయ్ వరల్డ్ ఎక్స్‌పోలో భారతీయ ప్రతిష్టను ఇనుమడింపజేసే బాధ్యతను మన దేశం తరఫున ఫిక్కీ తన భుజస్కందాలకు ఎత్తుకుంది. ఈ కార్యక్రమంలో హైదరాబాదుతో పాటు తెలంగాణకు కూడా ప్రచారం కల్పించే విషయమై ఫిక్కీ బృందంతో కలసి మురళీకృష్ణారెడ్డి కెటిఆర్‌తో చర్చించారు. తెలంగాణ పరిశ్రమలు మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజి బాధ్యతలు కూడా మంత్రి తారక రామారావే చూస్తున్న తరుణంలో, త్వరలో జరగనున్న అంతర్జాతీయ ఎయిర్ షో 'వింగ్స్' గురించి కూడా వీరి మధ్య చర్చ జరిగింది.

## ఆగస్టు 6,7,8 తేదీలలో శ్రీ సాయి కంచి వస్త్ర ప్రదర్శన మరియు అమ్మకం


నెల్లూరు నగరంలోని మాగుంట లే అవుట్ మెయిన్‌రోడ్డులో త్వరలో తాము ఏర్పాటు చేయనున్న నూతన షోరూం ప్రారంభోత్సవ సందర్భాన్ని పురస్కరించుకుని 'శ్రీ సాయి కంచి' వారు నగరంలో భారీ వస్త్ర ప్రదర్శన మరియు అమ్మకం నిర్వహిస్తున్నారు. ఆగస్టు 6,7,8 తేదీలలో మినీబైపాస్‌లోని అన్నమయ్య సర్కిల్ వద్ద ఉన్న పివిఆర్ కళ్యాణ మండపంలో ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఈ మూడు రోజుల్లో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు ఈ సేల్ జరుగుతుంది. కంచి, బనారస్, కోల్‌కత్తా, గద్వాల్, చెందేరి, పోచంపల్లి చీరలు ఈ ప్రదర్శనలో అమ్మకానికి లభిస్తాయని నిర్వాహకులు తెలిపారు.

## 'గ్రిడ్-స్కేల్ బ్యాటరీ శక్తి నిల్వ వ్యవస్థ'.. వివరాలేమిటి?

### - పార్లమెంట్‌లో ప్రశ్నించిన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



'గ్రిడ్-స్కేల్ బ్యాటరీ శక్తి నిల్వ వ్యవస్థ' వివరాలు తెలపాలని రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఈనెల3న పార్లమెంట్‌లో ప్రశ్నించారు. నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ మనదేశంలో వెయ్యి మెగావాట్ల గ్రిడ్ స్కేల్ బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయాలని యోచిస్తోందనేది వాస్తవమా కాదా అని ఆయన ప్రశ్నిస్తూ, అలా అయితే ఎన్‌టిపిసి ఏర్పాటు చేయడానికి ఎలాంటి విధానాలు అమలు చేయబోతున్నారని అడిగారు. అందుకు స్పందించిన కేంద్రమంత్రి ఆర్‌కె సింగ్ మాట్లాడుతూ బ్యాటరీ స్టోరేజ్ అనేది పవర్ సిస్టమ్ ఆపరేటర్లు, యుటిలిటీలను తరువాత ఉపయోగం కోసం శక్తిని నిల్వచేయడానికి వీలు కల్పించే ఒక సాంకేతికత అని, బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్ అనేది ఎలక్ట్రో కెమికల్ పరికరమని, ఇది గ్రిడ్ లేదా పవర్‌ప్లాంట్ నుండి శక్తిని సేకరిస్తుందని, తరువాత అవసరమైనప్పుడు విద్యుత్ లేదా గ్రిడ్ సేవలను అందించడానికి శక్తిని విడుదల చేస్తుందని చెప్పారు.



## ప్రథమ వర్ధంతి

### తిక్కవరపు బలరామరెడ్డి గారు

జననం : 19.03.1930 నిర్యాణం : 07.08.2020

చిరస్మరణీయం, ఆదర్శనీయం, అనుసరణీయం వారి జీవితం.

ఆగస్టు 7, 2021న వారి ప్రథమ వర్ధంతి సందర్భంగా

ఆ పుణ్యమూర్తిని స్మరించుకుంటూ...

భార్య : తిక్కవరపు హైమావతమ్మ

కుమారులు - కోడళ్ళు

టి.సీతారామిరెడ్డి - అనిత

టి.రామచంద్రారెడ్డి - సుజల

కుమార్తెలు - అల్లుళ్ళు

వేణుంబాక కమల - దినేష్‌రెడ్డి, మాజీ డి.జి.పి., ఆంధ్రప్రదేశ్

మారంరెడ్డి షీల - శివకుమార్‌రెడ్డి

మనుమరాళ్ళు, మనుమలు

సునయన, దిత్య, పూజిత, సంజన

రోహిత్, రితేష్, చేతన్

మరియు

మునిమనుమలు, మునిమనుమరాళ్ళు

# 'ప్రభా'తం

రెండు ఒలింపిక్స్‌లో పతకాలు గెలిచిన తొలి భారత మహిళగా సింధు నిలిచింది. నిలకడ, అంకితభావం, అద్భుత ప్రదర్శనకు ఆమె కొత్త ప్రమాణాలు నెలకొల్పింది. భారత్‌కు ఖ్యాతి తెచ్చిన ఆమెకు హృదయపూర్వక అభినందనలు. **- భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్**

టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం గెలిచిన సింధుకు అభినందనలు. ఆమె భారత్‌కు గర్వకారణం. మన గొప్ప ఒలింపియన్లలో ఆమె ఒకరు. **- భారత ప్రధాని నరేంద్ర మోడీ**

రెండు ఒలింపిక్ పతకాలతో భారత్ తరఫున చరిత్ర సృష్టించిన సింధుకు మనసారా అభినందనలు. టోక్యోలో ఆమె ఘనత చూసి ప్రతి భారతీయుడు ఉప్పొంగిపోతున్నాడు. **- ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

## తెలుగుతేజం.. సింధు

**సింధు...** ఈ పేరు ఇప్పుడు మార్మోగిపోతోంది. మన దేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా సింధు అందరికీ స్ఫూర్తిదాయకమైంది. టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ కీర్తిపతాకాన్ని రెపరెపలాడించింది. బ్యాడ్మింటన్‌లో అద్వితీయ ప్రతిభాపాటవాలతో రాణించి కాంస్య పతకం సాధించి దేశానికే గర్వకారణంగా నిలిచింది. అసాధ్యాలను సైతం ధైర్యంగా సుసాధ్యాలుగా చేసుకుంటూ నిరంతర కృషి.. పట్టుదలతో.. అనితర సాధ్యమైన ప్రతిభతో క్రీడారంగంలో అప్రతిహతంగా ముందుకు సాగిపోతోన్న క్రీడాకారిణి ఆమె. వరుసగా రెండు ఒలింపిక్స్‌లోనూ రెండు పతకాలు సాధించి పి.వి సింధు గొప్ప సంచలనం సృష్టించింది. దాదాపు వందేళ్ళకు పైగా ఒలింపిక్స్ చరిత్రలో మరే భారత మహిళకు సాధ్యం కాని రికార్డును మన తెలుగుబిడ్డ.. భరతమాత ముద్దుబిడ్డ సింధు సొంతం చేసుకుని ప్రపంచ వ్యాప్తంగా అందరి ప్రశంసలు అందుకుంటుండడం ఎంతైనా విశేషం. సింధు అద్వి తీయమైన క్రీడాప్రతిభ ప్రతిఒక్కరినీ మంత్రముగ్ధులను చేస్తుంది కూడా. విశ్వక్రీడా వేదికపై విజయదరహాసం చేస్తూ ఆమె పతకం అందుకోవడం ప్రతి తెలుగువాడు, ప్రతి భారతీయుడు గర్వించదగిన సందర్భం. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు దేశవ్యాప్తంగానే కాక ప్రపంచవ్యాప్తంగా ఎందరో ప్రముఖులు సింధును అభినందిస్తుండడం అందరికీ ఆనందదాయకం.

ఒలింపిక్స్‌లో పాల్గొనడమంటే ఆషామాషీ విషయం కాదు. క్రీడారంగంలో సాటిలేని మేటి అనదగ్గ అద్భుత ప్రావీణ్యం ఉంటే తప్ప ఒలింపిక్స్ గేటు దగ్గరకు కూడా వెళ్ళలేం. ప్రపంచవ్యాప్తంగా అసాధారణ ప్రజ్ఞాపాటవాలున్న క్రీడాకారులెంతోమంది ఈ విశ్వక్రీడల్లో పాల్గొంటూ తమ సత్తా ఏమిటో చూపుతారు. ఒకవైపు కరోనా గుడ్లురుముతున్న తరుణంలో, ప్రేక్షకులు లేకుండానే ఒలింపిక్స్ నిర్వహిస్తూన్న జపాన్.. టోక్యోలో దేదీప్యమానంగా కళ్ళు చెదిరిపోయేలా విశ్వక్రీడా సంరంభానికి తెరతీసింది. 17 రోజుల పాటు జరిగే ఈ ప్రపంచ క్రీడాపండుగైన ఒలింపిక్స్‌లో 206 దేశాల నుంచి దాదాపు 11 వేల మంది వివిధ క్రీడలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటున్నారు. ఇందులో మనదేశానికి చెందిన 127 మంది అథ్లెట్లు ఉన్నారు. వీరిలో 63 మంది పురుషులు, 54 మంది మహిళలు పాల్గొని 18 రకాల క్రీడా విభాగాల్లో తమ ప్రతిభను చాటుకుంటూ పతకాలు సాధించాలనే ధ్యేయంతో పోటీపడుతున్నారు. 2016లో రియో ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన సింధు ఈసారి టోక్యోలో ఎలాగైనా సరే స్వర్ణపతకం సాధించాలనే పట్టుదలతో రంగంలోకి దిగింది. సెమీ ఫైనల్లో ఓటమి ఎదురుకావడంతో ఆశలు అడుగంటిపోతున్నా.. మనసును దృఢం చేసుకుంది. ఓటమికి ఏమాత్రం కుంగిపోకుండా దేశానికి వెళ్తే బంగారు పతకంతోనే వెళ్ళాలనే గట్టి పట్టుదలతో ముందుకు సాగింది. ఆ మనోధైర్యమే ఆమెకు విజయాన్ని చేరువ చేసింది. చైనా క్రీడాకారిణితో జరిగిన మ్యాచ్‌లో అత్యద్భుతమైన ఆటతీరుతో సింధు అద్భుత విజయం సాధించి 'జయహో సింధూ' అనిపించుకుంది. ఒలింపిక్స్‌లో కాంస్యపతకంతో మిలమిల మెరుస్తూ మన తెలుగమ్మాయి పూసర్ల వెంకట సింధు (పివి సింధు) అందరి కరతాళధ్వనులందుకుంది. ఓటమి నుంచే విజయానికి బాటలు వేసుకోవాలన్న స్ఫూర్తిని సింధు అందరిలోనూ నింపింది. కేవలం 14ఏళ్ళ వయస్సులోనే సింధు అంతర్జాతీయ క్రీడారంగంలో ప్రవేశించింది. అత్యుత్తమమైన క్రీడా ప్రతిభతో రాణిస్తూ... అందరి ప్రశంసలను అందుకుంటోంది.

అంతర్జాతీయస్థాయిలో ఎన్నో పతకాలు సాధించిన సింధు ఇప్పటికే ఎన్నో విశిష్టమైన అవార్డులు, పురస్కారాలను కూడా అందుకుంది. 2013లో అర్జున అవార్డుతో పాటు, 2016లో అత్యున్నత క్రీడాపురస్కారం రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న అవార్డును సాధించింది. 2015లో పద్మశ్రీ పురస్కారాన్ని, 2020లో పద్మభూషణ్ పురస్కారాలను కూడా పొందింది. గత ఏడాది రజతం సాధించి, ఈ ఏడాది కాంస్యంతోనే సరిపెట్టుకున్నా, అదిగో.. వచ్చే ఏడాది జరగనున్న ప్యారిస్ ఒలింపిక్స్‌లో మాత్రం తప్పకుండా స్వర్ణం సాధించి సింధు 'స్వర్ణ సింధూ'రంగా మెరిసిపోతుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే అద్వితీయమైన ఆమె క్రీడాస్ఫూర్తి.. రేపటి స్వర్ణ కీర్తికి సంకేతంగా కనిపిస్తోంది. సింధు ఆ మహాద్భుత విజయాన్ని కూడా సాధించి తీరుతుందనే నమ్మకం తెలుగువారిలోనే కాదు.. భారతీయులందరి హృదయాల్లో నిండుగా మెండుగానే ఉంది. సింధు స్వర్ణపతకం సాధించే రోజు త్వరలోనే వస్తుంది కూడా!.. ఆ రోజు కోసం అందరం కోట్లాదికళ్ళతో ఎదురుచూద్దాం మరి!....



ఎక్కడబట్టినా ఇప్పుడు 'సింధు' పేరు మార్మోగిపోతోంది. మనదేశంలోనే కాదు ప్రపంచవ్యాప్తంగా సింధు అందరికీ స్ఫూర్తిదాయకమైంది. టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ కీర్తిపతాకాన్ని రెపరెపలాడించింది. బ్యాడ్మింటన్‌లో అద్వితీయ ప్రతిభాపాటవాలతో రాణించి కాంస్య పతకం సాధించి దేశానికే గర్వకారణంగా నిలిచింది. దాదాపు వందేళ్ళకుపైగా ఒలింపిక్స్ చరిత్రలో మరే భారత మహిళకు సాధ్యం కాని రికార్డును మన తెలుగుబిడ్డ.. భరతమాత ముద్దుబిడ్డ సింధు సొంతం చేసుకుని ప్రపంచవ్యాప్తంగా అందరి ప్రశంసలు అందుకుంటోంది. ఆమె క్రీడా స్ఫూర్తి.. రేపటి స్వర్ణ కీర్తికి సంకేతంగా కనిపిస్తోంది. సింధు ఆ మహాద్భుత విజయాన్ని కూడా వచ్చే ఏడాది జరగనున్న ప్యారిస్ ఒలింపిక్స్‌లో తప్పకుండా సాధించి తీరుతుందని ఆశిద్దాం!...

## పురిటి బిడ్డలకు తల్లిపాలే అమృతం

**- 7 వరకు వారోత్సవాలు**



పురిటి బిడ్డలకు తల్లిపాలు అమృతం లాంటివి. ఎందుకంటే బిడ్డలకు వ్యాధి నిరోధక శక్తిని పెంచే అద్భుతమైన శక్తి తల్లిపాలకి మాత్రమే ఉంటుంది. పురుడుపోసుకున్న అర్ధ గంటలోపే బిడ్డలకు తల్లిపాలు (ముర్రు పాలు) పట్టిస్తే ఎన్నో రకాలైన వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. అయితే ఈ విషయం పట్ల అనేకమంది తల్లులకు అవగాహన లేకపోవడం వల్ల బిడ్డలకు ఆలస్యంగా పాలు పట్టిస్తుంటారు. బిడ్డ పుట్టినప్పటినుంచి కనీసం 6 నెలల వరకు తల్లిపాలు అందించడం వల్ల బిడ్డల ఆరోగ్యం ఎంతో బావుంటుంది. బిడ్డ ఆరోగ్యానికి రక్షణ కవచంగా ఉండేది తల్లిపాలే. బిడ్డలకు అవసరమైన అన్నిరకాల పోషకాలు అందేది తల్లిపాల నుంచే. అయితే అనేకమంది నిరుపేద తల్లులకు ఈ విషయంలో సరైన అవగాహన ఉండడం లేదు. ఈ నేపథ్యంలో ప్రతిఏటా ఆగస్టు1 నుంచి ఏడురోజుల పాటు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తూ పురిటిబిడ్డలకు పాలు పట్టించే విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను అంగన్‌వాడీ ఉపాధ్యాయుల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని తల్లులకు అవగాహన కలిగిస్తున్నారు. జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఈనెల1 నుంచి తల్లిపాల వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. నెల్లూరు గాంధీనగర్‌లోని మహిళా ప్రాంగణంలో ఐసిడిఎస్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి తొలిరోజున ఈ వారోత్సవాలను ప్రారంభించారు. పురిటిబిడ్డలకు తల్లిపాల కంటే శ్రేష్టమైనవి మరేమీ లేవన్నారు. తల్లీబిడ్డల ఆరోగ్యానికి తల్లులు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. ఈనెల 7వ తేది వరకు ఈ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని అంగన్‌వాడీలకు సూచించారు. ఆ తర్వాత వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు, మహిళా ప్రాంగణం సిబ్బంది, నెల్లూరు అర్బన్ ఐసిడిఎస్ సిడిపిఓ అనూరాధ, వెంగళరావునగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ కో-ఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, సిడిపిఓలు హేనా సుజన, ఉదయలక్ష్మి, శంషాద్‌బేగం, విజయలక్ష్మి, పద్మజాకుమారి, సౌజన్య, మాధవి, పద్మావతి, సేవాసదన్ అధికారి కె.మాధవి, డిసిపిఓ సురేష్, షెహనాజ్, ఐసిడిఎస్ కార్యాలయం ఏ.ఓ శర్మిష్ట, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు సునీలత, ప్రమీలమ్మ, లక్ష్మీబాయి, శకుంతల, సుజాత, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## గుండెమడకల గంగమ్మకు ప్రత్యేక పూజలు

వింజమూరు మండలంలోని గుండెమడకల గ్రామంలో కొలువై ఉన్న గ్రామదేవత గంగమ్మకు ఈనెల 1న గ్రామస్తులు పెద్దఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొంగళ్లుపెట్టి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అమ్మవారికి సుగంధభరిత పుష్పాలతో కన్నులపండువగా అలంకారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ బుర్రాల శ్రీనివాస యాదవ్, చల్లా యానాదయ్య తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

## కోవిడ్ కేర్ సెంటర్‌ను తనిఖీ చేసిన ఆర్డీఓ



కావలి మునిసిపాలిటీ పరిధిలోని మద్దూరుపాడు టిడ్కో హౌస్‌లో ఏర్పాటు చేసిన కోవిడ్ కేర్ సెంటర్‌ను ఈనెల 1న కావలి ఆర్డీఓ శీనానాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కరోనా బాధితులను పరామర్శించి, వారికి ఈ సెంటర్‌లో ఎలాంటి వసతులు అందుతున్నాయో ఆరా తీశారు. బాధితులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట నోడల్ ఆఫీసర్ డాక్టర్ కర్నాటి రోహిత్, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నేత్ర సమర్పణోద్యమంలో.. మునుపటిలా ముందుకు సాగాలి




డాక్టర్ పిఎల్ రావుగా సుప్రసిద్ధులైన పాబోలు లక్ష్మణరావు అకాలమరణం విచారకరం. ఒక నేత్రవైద్యునిగా నెల్లూరుజిల్లాలో, ముఖ్యంగా నెల్లూరు నగరంలో ఆయన అరుదైన చొరవ తీసుకుని నేత్ర సమర్పణోద్యమాన్ని చాలా ముందుకు తీసుకుపోయారు. నేత్రసమర్పణలో మార్పిడికి అనువైన శుక్లపటలం (కార్నియా) అనే కంటిలోని భాగాన్ని మాత్రమే మృతుల నుంచి తీయడమనే ఆధునిక ప్రక్రియను ప్రవేశపెట్టిన ఘనత డాక్టర్ పిఎల్ రావుదేనని చెప్పవచ్చు. ఫలితంగా కార్నియా పరిరక్షణ, దాని నిల్వ కాలం పెరగడం సాధ్యపడుతుంది. దాంతోపాటు, సేకరించిన కార్నియాలను వీలైనంతవరకు నెల్లూరులోని రోగులకు మార్పిడిచేసే సౌకర్యాన్ని ఆయన తమ వైద్యశాలలో కల్పించడం విశేషం. అయితే, ఇప్పుడు ఆయన లేరు. వారు నిర్వహిస్తుండిన 'పాబోలు-ఓగిరాల రామ్ చారిటబుల్ ట్రస్ట్' ద్వారా నేత్ర సమర్పణోద్యమాన్ని ముందుకు తీసుకుపోవడంలో ఆ సంస్థ బాధ్యులు వారు లేని లోటు రానివ్వకుండా ముందుకు సాగగలరని, తద్వారా డాక్టర్ పిఎల్ రావు ఆశయాలను గౌరవించగలరని నా విన్నపం. డాక్టర్ పిఎల్ రావు మృతికి విచారిస్తూ, వారి కుటుంబానికి నెల్లూరు నేత్రదాతల సంస్థ ప్రగాఢ సంతాపం తెలియజేస్తోంది.

**– తిక్కవరపు సుకుమార్‌రెడ్డి**
**కార్యదర్శి, నేత్రదాతల సంస్థ, నెల్లూరు.**

## దోమలతో ఎంతకాలం ఈ బాధలు?

నెల్లూరు నగరంలో దోమల బాధ విపరీతంగా ఉంటోంది. ఎంతకాలం ఈ బాధలు పడాలో తెలియడం లేదు. ముఖ్యంగా బాలాజీనగర్, ఏసినగర్, సరస్వతినగర్ తదితర శివారు ప్రాంతాల్లో దోమలు కుప్పలుతెప్పలుగా పెరిగిపోతున్నాయి. మురుగుదిబ్బలు, చెత్తకుప్పలు పెరిగిపోతూ దోమలకు స్థావరాలుగా ఉంటున్నాయి. ఇప్పుడు వానలు కూడా కురుస్తుండడంతో సైడు కాలువలు మురుగు కాలువలుగా నిండిపోయి వీధుల్లోకి పొంగి ప్రవహిస్తున్నాయి. నగరంలో ఎలాంటి కట్టడాలు లేకుండా ఉన్న అనేక ఖాళీస్థలాలు మళ్ళీ మురుగుగుంటలుగా మారిపోతున్నాయి. కార్పొరేషన్ వాళ్ళు దోమలను అరికట్టడానికి ఏ అమావాశ్యకో పౌర్ణమికో పొగమందు, కాలువల్లో మందు కొట్టేవారు. ఇప్పుడది కూడా కనిపించడం లేదు. ఇకనైనా వెంటనే దోమల్ని నివారించేందుకు కార్పొరేషనోళ్లు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ప్రార్థన. **– కె.వెంకటరంగయ్య, నెల్లూరు.**

# సర్పంచ్‌లకు మంచి శిక్షణ

## ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య



నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు శిక్షణా తరగతులు ఓ మంచి కార్యక్రమ మని సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య అన్నారు. దొరవారిసత్రం మండలంలో జరుగుతున్న సర్పంచుల శిక్షణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వైఎస్‌ఆర్‌సిపి ప్రభుత్వం ప్రజలకు ఉత్తమమైన సేవలు అందించేందుకు నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లకు శిక్షణా తరగతులు నిర్వహించటం ఎంతో మంచిదని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు అవసరమైన అన్ని సేవలను అందించటం కోసం నిత్యం శ్రమిస్తున్నారని అందులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని ప్రశంసించారు.

# చిరస్మరణీయుడు నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి

## - ఎన్‌బికెఆర్ డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి



విద్యాప్రదాత, పద్మశ్రీ పురస్కార గ్రహీత, దివంగత నేదురుమల్లి బాలకృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయమని విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి కొనియాడారు. ఆగస్టు 3న బాలకృష్ణారెడ్డి 43వ వర్ధంతిని పురస్కరించుకుని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలోని ఎన్‌బికెఆర్ పార్కులో ఉన్న బాలకృష్ణారెడ్డి విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలకృష్ణారెడ్డి విద్యారంగానికి చేసిన సేవలు మరువలేనివని, విద్య పట్ల ఆయనకున్న గౌరవం అపారమైనదని, ఆయన స్థాపించిన విద్యాసంస్థల్లో చదువుకున్న విద్యార్థులు దేశ విదేశాల్లో కూడా ప్రతిభను చాటుకుంటూ గొప్ప స్థానాల్లో పనిచేయడం గర్వకారణమని అన్నారు. ఆనాడు ఆయన వేసిన విద్యాబీజం ఈనాడు ఇంతటి మహావృక్షం అయిందని, ఆయన ఆశయాలు ఎంతో ఉన్నతమైనవి కాబట్టే ఈ ప్రాంతం కూడా విద్యారంగంలో ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. బాలకృష్ణారెడ్డి ఆశయ సాధనకు అనుగుణంగా మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి అనేక సంస్థలు స్థాపించారని, ఎన్‌బికెఆర్ కళాశాల కరెస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఎంతో కృషి చేస్తూ ఈ విద్యాసంస్థలను అన్నివిధాలుగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని ఆయన ప్రశంసించారు. ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల రాష్ట్రంలోనే కాక దేశంలోని అత్యున్నత కళాశాలల్లో ఒకటని, కళాశాల సిబ్బంది ఎంతో అంకితభావంతో పనిచేస్తూ కళాశాల అభివృద్ధికి తోడ్పడుతున్నారని ఆయన అభినందించారు. తొలుత విద్యాదాత బాలకృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా ఎన్‌బికెఆర్ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ సంచాలకుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల బోధనా సిబ్బంది, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# 'దిశ' యాప్‌పై అవగాహన



నెల్లూరు జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు దిశ యాప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం వార్డు సచివాలయం ఉమెన్ ప్రొటెక్షన్ సెక్రెటరీ శయాస్మిన్ ఆధ్వర్యంలో జరిగింది. మహిళలందరికీ యాప్ ద్వారా కలిగే ప్రయోజనాలను ఉద్యోగస్తులు అందరికీ ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

# కోవిడ్ నిబంధనలతోనే బారా షహీద్ ఉత్సవాలు

## రొట్టెల పండుగ రద్దు

## - జేసీ హరేందిర ప్రసాద్ వెల్లడి

ఈనెల19 నుంచి జరగాల్సిన రొట్టెల పండుగను కోవిడ్ కారణంగా రద్దు చేస్తున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ హరేందిర ప్రసాద్ ప్రకటించారు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ బారాషహీద్ దర్గాలోనే సాంప్రదాయ పద్ధతులను అనుసరించి ఉత్సవాలు జరుగుతాయని జేసీ కలెక్టరేట్‌లో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో పేర్కొన్నారు. గత సంవత్సరం కూడా కోవిడ్ నేపథ్యంలో ఊరేగింపు లేకుండా దర్గాలోనే ఉత్సవాలు నిర్వహించడం జరిగిందన్నారు. ప్రస్తుతం జిల్లాలో కోవిడ్ మహమ్మారి ఇంకా తగ్గు ముఖం పట్టనందున జన సమూహం లేకుండా దర్గాలోనే దర్గా సాంప్రదాయ పద్ధతులను అనుసరించి 20 మంది మత పెద్దలతోనే ప్రార్థనలు, గంధం, ఉరుసు ఉత్సవాలు జరుగుతాయన్నారు. కరోనా పాజిటివ్ కేసులు ఉన్నందున ఎటువంటి ప్రదర్శనశాలలు ఏర్పాటు చేయకూడదని, టెండర్లు ఏమీ ఉండవని స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలు, ప్రాంతాల నుండి ఎవరు కూడా పెద్ద ఎత్తున జిల్లాకు తరలిరాకుండా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు.




# ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే ప్రసన్న

## - కోవూరు అభివృద్ధికి నిధులిస్తానన్న సిఎం జగన్

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఈనెల 2న తాడేపల్లిలోని ముఖ్యమంత్రి కార్యాలయంలో కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గౌరవపూర్వకంగా కలుసుకున్నారు. తన కుమారుడు నల్లపరెడ్డి రజిత్‌రెడ్డితో కలిసి ముఖ్యమంత్రిని కలుసుకుని కోవూరు అభివృద్ధి విషయం చర్చించారు. ముఖ్యంగా సంగం నుంచి బుచ్చిరెడ్డిపాళెం దాకా 85 కోట్ల రూపాయల వ్యయంతో పైప్‌లైన్ నిర్మించాల్సి ఉందని, కోవూరు నుంచి నెల్లూరు వరకు 8 కోట్ల వ్యయంతో ఆర్‌అండ్‌బి రోడ్లను, మరో 10 కోట్లతో సిసి రోడ్లు, 10 కోట్ల వ్యయంతో డ్రైన్ల నిర్మాణాలు జరగాల్సి వుందని, వీటికి నిధులు కేటాయించాలని ప్రసన్న ముఖ్యమంత్రికి విజ్ఞప్తిచేశారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను కూడా ఆయన సిఎంతో చర్చించారు. అందుకు స్పందించిన ముఖ్యమంత్రి జగన్ త్వరలోనే కోవూరు నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారని ఎమ్మెల్యే ప్రసన్న సంతోషం వ్యక్తం చేశారు.



# సింధును ఆదర్శంగా తీసుకోవాలి

**- ముక్కాల ద్వారకానాథ్**



ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రతిష్ఠాత్మకమైన ఒలింపిక్ క్రీడల్లో రెండుసార్లు పతకాలు సాధించిన ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధును క్రీడాకారులు ఆదర్శంగా తీసుకుని క్రీడాస్ఫూర్తితో రాణించాలని ఏపి బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకనాథ్ అన్నారు. టోక్యోలో జరుగుతున్న ఒలింపిక్స్‌లో సింధు విజయం సాధించిన సందర్భంలో ఈనెల 2న నెల్లూరులోని తన కార్యాలయంలో క్రీడాకారులైన చిన్నారులతో కలసి కేకు కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ముక్కాల మాట్లాడుతూ భారతదేశ క్రీడాప్రతిభను ప్రపంచవ్యాప్తం చేసిన సింధు దేశానికే గర్వకారణమని కొనియాడారు. సింధు బ్యాడ్మింటన్ క్రీడాప్రస్థానం 2007లో నెల్లూరులో జరిగిన జాతీయక్రీడలతోనే ప్రారంభం కావడం జిల్లాకు సంతోషకరమైన విషయమన్నారు. క్రీడారంగంలో ఎన్నో ఆటుపోట్లు తట్టుకుని సింధు సాధించిన విజయాలు అనన్యసామాన్యమన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి జగన్ క్రీడలను ఎంతో ప్రోత్సహిస్తున్నారని, దాంతో ఈ ఏడాది కూడా జాతీయ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకుని సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులు, కోచ్‌లకు అవార్డులు అందజేస్తామన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రతినిధులు మద్దిపాటి ప్రసాద్‌రావు, ఎన్‌వి వెంకటేశ్వర్లు, గాదంశెట్టి శ్రీకాంత్, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కార్యదర్శి అరిగెల విజయకుమార్, కోచ్ వెంకటేష్, క్రీడాకారులు శరత్‌కుమార్, ప్రసాద్, రమేష్, రాజేష్ పాల్గొన్నారు.

# పశుసంవర్ధక శాఖ డి.డిగా డాక్టర్ సురేష్

పశుసంవర్ధక శాఖ నెల్లూరు డివిజన్ ఇన్‌చార్జి డెప్యూటి డైరెక్టర్‌గా డాక్టర్ బివి సురేష్‌ను నియమిస్తూ ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ మహేశ్వరుడు ఈనెల 1న ఆదేశాలిచ్చారు. ఇప్పటిదాకా ఈ స్థానంలో పనిచేసిన పివిఎల్ నరసింహారావు ఉద్యోగ విరమణ పొందడంతో ఇన్‌చార్జి బాధ్యతలను సురేష్‌కు కేటాయించారు.

# గృహనిర్మాణ సంస్థ పి.డిగా శేషయ్య

జిల్లా గృహనిర్మాణ సంస్థ ఇన్‌చార్జి ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఆ శాఖలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న టివి శేషయ్య నియమితులయ్యారు. ఇప్పటిదాకా పీడీగా ఉన్న ఆదిసుబ్రహ్మణ్యం గతనెల 31న ఉద్యోగ విరమణ చేయడంతో ఆ స్థానంలో టివి శేషయ్యను నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు.

# నగరంలో బాంబ్‌స్క్వాడ్ తనిఖీలు



ఆగస్టు 15న స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు నిర్వహించనున్న నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లా ఎస్పీ విజయారావు ఆదేశాలతో ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా నగరంలో పోలీసులు బాంబ్‌స్క్వాడ్ తనిఖీలను ముమ్మరం చేశారు. నగరంలోని ఆర్టీసి బస్టాండ్, రైల్వేస్టేషన్, షాపింగ్‌మాల్స్, జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. అనుమానాస్పదంగా ఉన్న ప్రయాణీకుల బ్యాగులను కూడా పరిశీలించి వారి వివరాలు సేకరించారు.

# మాస్కులు పంపిణీ



కరోనా వ్యాధి పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని కోరుతూ నెల్లూరులోని సెట్నెల్, నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో ఈనెల 3న అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నగరంలోని కొండాయపాలెం గేటు ప్రాంతంలోను, ఏకె నగర్ ప్రాంతంలో రోజువారీ కూలీలకు మాస్కులు అందజేసి కోవిడ్ నిబంధనలు పాటించి అందరూ కరోనా వ్యాధికి దూరంగా ఉండాలన్నారు. నెహ్రూ యువకేంద్ర జిల్లా అధికారి మహిధర్‌రెడ్డి, సెట్నెల్ మేనేజర్ శ్రీమన్నారాయణ, విజయమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నెల్లూరు కబుర్లు



# 'స్పందన' అర్జీలను వారంలోగా పరిష్కరించాలి

**అధికారులకు కలెక్టర్ ఆదేశం**

స్పందన కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చిన అర్జీలను వెంటనే పరిశీలించి వారం రోజుల్లోగా వాటిని పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. ఈనెల 2న ఆయన కలెక్టరేట్ ఆవరణంలో జరిగిన ప్రజావిజ్ఞప్తుల దినం కార్యక్రమం అనంతరం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. స్పందన కార్యక్రమంలో ఇప్పటిదాకా 2,168 అర్జీలు వచ్చాయని, వీటిలో 19,721 అర్జీలు పరిష్కారమయ్యాయని అంటూ మిగిలిన అర్జీలను కూడా త్వరగా పరిష్కరించాలని చెప్పారు. ఈ సమావేశంలో జేసీలు హరేందిరప్రసాద్, గణేష్‌కుమార్, విదేహ్ ఖరే, ట్రైనీ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

# ప్రభుత్వాల ప్రజావ్యతిరేక పాలన

**డిసిసి నేత చేవూరు విమర్శ**



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాల వల్ల, ప్రభుత్వాలు చిత్తం వచ్చిన రీతిగా ప్రజలపై పన్నుల భారం మోపడం వల్ల ప్రజల జీవనస్థితిగతులు అస్తవ్యస్తమవుతున్నాయంటూ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. పార్టీ పునర్వ్యవస్థీకరణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 1న నెల్లూరులోని ఇందిరాభవన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర ఎస్సీఎస్టీ బిసి మైనార్టీ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి, రాష్ట్రంలో వైసిపి ప్రజలపై విచిత్రమైన పన్నులు వేస్తున్నాయని, ఈ కొత్తపన్నులు పేదలకు శాపంగా పరిణమించాయని విమర్శించారు. రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు వినయ్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం అమలుచేస్తున్న జిఎస్టీతో దేశవ్యాప్తంగా ధరల భారం పెరిగిందని, రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం కొత్త ఆస్తిపన్ను విధానమంటూ చెత్తపై కూడా పన్నువేస్తూ ప్రజల నడ్డివిరుస్తోందని విమర్శించారు. తొలుత షేక్ ఖాజామస్తాన్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్ రాష్ట్ర బిసి సెల్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు దాదాగాంధీ, ఎస్టీ సెల్ అధ్యక్షురాలు శాంతకుమారి, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధి సురేష్‌బాబు, నాయకులు కొండా అనిల్, ఉడతా వెంకట్రావు, ఫయాజ్, కరిముల్లా, కొండా అనిల్‌కుమార్, సురేష్‌బాబు, వెంకటేశ్వర్లు, రమేష్, భవాని నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# నకిలీలను ఏరివేయాలి

**గిరిజన నేత డిమాండ్**

ఎస్టీలమంటూ నకిలీ ధృవీకరణ పత్రాలతో నమ్మించి ఉద్యోగాలు చేస్తున్నవారిని ఏరివేయాలని, అలాంటివారిని వెంటనే గుర్తించి విధుల నుంచి తొలగించి తగు చర్యలు తీసుకోవాలని ఏపి యానాది గిరిజన ఉద్యోగసంఘం జిల్లా అధ్యక్షుడు బూదూరు కేశవరామ్ డిమాండ్ చేశారు. ఈనెల 1న నెల్లూరులోని వెన్నెలకంటి రాఘవయ్యభవన్‌లో జరిగిన ఉద్యోగసంఘం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్ని శాఖల్లో రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను పాటించాలన్నారు. బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీచేయాలని, రాష్ట్రంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులను రెండేళ్ళ సర్వీసు పూర్తయిన వెంటనే రెగ్యులర్ చేయాలని, శాఖాపరమైన పరీక్షలు రద్దుచేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు చెంచయ్య, రవీంద్ర, సుధాకర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌క్రాస్ సేవలు అమోఘం

**- కొనియాడిన రాష్ట్రశాఖ ఛైర్మెన్ శ్రీధర్‌రెడ్డి**



నెల్లూరు రెడ్‌క్రాస్ సేవలు అమోఘమని రెడ్‌క్రాస్ రాష్ట్ర కమిటీ ఛైర్మెన్ డాక్టర్ శ్రీధర్‌రెడ్డి కొనియాడారు. ఈనెల 1న నెల్లూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కోవిడ్ సమయంలో ఎంతో అంకితభావంతో నిర్వహించిన సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌రెడ్డిని, పలువురు కమిటీ సభ్యులను సన్మానించారు. రెడ్‌క్రాస్ కమిటీ రాష్ట్ర వైస్ ఛైర్మెన్ జగన్మోహన్, కోశాధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, విశాఖపట్నం, చిత్తూరు జిల్లాల కమిటీ ఛైర్మెన్లు ప్రకాష్‌బాబు, ప్రసాద్‌తో పాటు నెల్లూరు రెడ్‌క్రాస్ వైస్‌ఛైర్మెన్ సుధీర్‌నాయుడు, కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, రాష్ట్ర సభ్యుడు రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆందోళన బాట పట్టిన పారామెడికల్ ఉద్యోగులు

**- రెగ్యులర్ చేయాలంటూ నాయకుల విజ్ఞప్తి**



గత ఇరవై ఏళ్ళుగా పని చేస్తున్న తమను రెగ్యులర్ చేయాలంటూ పారామెడికల్ ఉద్యోగులు ఆందోళన బాట పట్టారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని గతంలో ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు జగన్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, కరోనా విపత్తులో ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన పారామెడికల్ ఉద్యోగులను ప్రభుత్వం కనికరించి రెగ్యులర్ చేయాలని పారామెడికల్ ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. ఈనెల 2న నెల్లూరులోని గాంధీబొమ్మ కూడలి వద్ద నుంచి డిఎంహెచ్‌ఓ కార్యాలయం దాకా ఏపి డిఎస్‌సి కాంట్రాక్ట్ పారామెడికల్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో పారామెడికల్ ఉద్యోగులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో జేఏసి రాష్ట్ర కన్వీనర్ శేషయ్య, నాయకులు రమణారెడ్డి, రత్నాకర్, ఎన్జీఓల సంఘం నాయకుడు మన్నేపల్లి పెంచలరావు మాట్లాడుతూ డిఎస్సీ ద్వారా ఎంపికైన పారామెడికల్ ఉద్యోగులు వైద్య ఆరోగ్యశాఖలో కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ విధానంలో ఎంతోకాలంగా పనిచేస్తున్నారని, వారిని వెంటనే రెగ్యులర్ చేసి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐకాస రాష్ట్ర కన్వీనర్ ఏవి శేషయ్య, ఏపిజిఇఓ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, యునైటెడ్ మెడికల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సతీష్, శివప్రసాద్, ఏపిజిఇఓ రాష్ట్ర అధ్యక్షుడు చొప్పా రవీంద్రబాబు, సిఐటియు జిల్లా కార్యదర్శి అజయ్ కుమార్, హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు పాల్గొన్నారు.

# 'నుడా'కు ఏఓ నియామకం

నెల్లూరు పట్టణాభివృద్ధి సంస్థ (నుడా) అడ్మినిస్ట్రేటివ్ అధికారి నియమితులయ్యారు. గ్రేడ్-3 అధికారిగా ఉన్న హనుమంతు శంకర్‌రావును నుడా ఏఓగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ శ్రీలక్ష్మి ఈనెల 3న ఉత్తర్వులిచ్చారు.

# విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలి

విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేయాలనే నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సిఐటియు నాయకుడు అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈనెల 3న నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులంతా పోరాటానికి సిద్ధం కావాలన్నారు. ఈ ఆందోళనలో సిపిఎం నగర కార్యదర్శి మూలం రమేష్, సిఐటియు నగర కార్యదర్శి నాగేశ్వరరావు, నాయకులు కత్తి శ్రీనివాసులు, పెంచలనరసయ్య, సూర్యనారాయణ, మూలం ప్రసాద్, సుధాకర్‌రెడ్డి, మురళి, నాగూర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా అయ్యప్పగుడి వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు మాదాల వెంకటేశ్వర్‌రావు, కొండా ప్రసాద్, సంపత్‌కుమార్, చాంద్‌బాషా, నరసింహులు, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొని విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ వద్దంటూ నినాదాలు చేశారు.

# ప్రభుత్వాల అనుమతులతోనే కొత్త పన్నులు

## - ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి



కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుమతులతోనే కొత్త పన్నుల విధానాన్ని ప్రారంభించడం జరిగిందని వెంకటగిరి ఎమ్మెల్యే, మాజీమంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. ఇటీవల ఆయన వెంకటగిరి సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ గడిచిన రెండేళ్ళలో వెంకటగిరి మునిసిపాలిటీలో ఎవరికీ పన్ను విధించలేదని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మన తలసరి ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని నూతన పన్ను విధానం అమలుకు నిర్ణయించిందని ఆయన అన్నారు. 2006 నుంచి 2021లోపు ఈ 14 సంవత్సరాల కాలంలో పన్ను డివిజన్ జరగలేదని, పన్ను విధానం మారలేదని, ఇదంతా గత మునిసిపల్ కౌన్సిళ్ళలో జరిగిన తప్పిదాలేనని ఆయన వివరించారు. అనుమతులు లేకుండా ఇల్లు కట్టుకున్నవారికి, సరైన పత్రాలు లేకుండా నివాసాలు ఏర్పాటు చేసుకున్నవారికి అవసరమైన పత్రాలు ఏర్పాటుచేస్తే ఈ పన్ను విధానంలో మన మునిసిపాలిటీకి ఆదాయం ఉంటుందని ఆయన సూచించారు. కౌన్సిలర్లు అందరూ కలసి చర్చించి మునిసిపాలిటీకి ఆదాయం రావడానికి ఏమి చేయాలి?.. ఏ విధంగా పన్నులు వసూలు చేయాలని, పన్నుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని అభివృద్ధి చేయడానికి ఎలా ఉపయోగించి వెంకటగిరి మునిసిపాలిటీని మరింతగా అభివృద్ధి చేసుకోవాలన్న కోణంలో సమగ్రంగా చర్చించాలని ఆయన సూచించారు.

# పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం నిరంతర కృషి

## - మంత్రి అనిల్‌కుమార్‌యాదవ్

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని రాష్ట్ర జలవనరుల మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. నెల్లూరు స్టోన్‌హౌస్ పేటలోని ఆర్‌ఎస్‌ఆర్ హైస్కూల్‌లో అక్షయ పాత్ర ఆధ్వర్యంలో నిర్వహించిన నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన దాదాపు 1600 మంది పారిశుద్ధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు ప్రతినెల జాప్యం లేకుండా వేతనాలు అందించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలో త్వరలో పారిశుద్ధ్య కార్మికులకు అతి తక్కువ ధరలో నిత్యావసర వస్తువులను అందజేసేందుకు స్టోర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఇక్కడ 20 శాతం నుంచి 30 శాతం వరకు ధరలు తగ్గించి అందిస్తామన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా నెల్లూరు కార్పొరేషన్‌లోనే పారిశుద్ధ్య కార్మికులకు తొలి స్టోర్‌ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకానాథ్, నెల్లూరు నగర కమిషనర్ దినేష్‌కుమార్, నూనె మల్లికార్జున్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు





మిజోరం గవర్నర్‌గా నియమితులైన ప్రకాశంజిల్లాకు చెందిన మాజీ ఎంపీ కంభంపాటి హరిబాబును ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి ఆయన తనయుడు యువనాయకులు మాగుంట రాఘవరెడ్డి ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో ఈ నెల 3న మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి,పూలమాలతో ఘనంగా సన్మానించారు.






# వైసీపీకి వైజాగ్ స్టీల్ ఫ్యాక్టరీ గండం!

రాజకీయ పార్టీలకు ఎటునుంచి గండం ఎదురవుతుందో ముందుగానే చెప్పలేం. 'నూరు గొడ్లను తిన్న రాబందు...ఒక్క గాలివానకే 'గోవిందా' అనే సామెత అందరికీ తెలిసిందే అయినా... ఆ ఒక్క' గాలివాన' ఏమిటి అనేది రాజకీయాలలో అంచనా వేయడం కష్టం. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీని మట్టి కరిపించి, ప్రజాక్షేత్రంలో అప్రతిహతంగా సాగిపోతున్న వైసీపీ 2024లో మాత్రం 'స్టీల్ ప్లాంట్ గండం' నుంచి ఎలా గట్టెక్కుతుంది అనేది పరిశీలకులకు అర్ధం కావడం లేదు. ఆంధ్రులకు విలువైన ఆస్తిపాస్తులు ఏవీ ఉండడానికి వీలులేదన్న చందంగా కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం గత ఏడేళ్లుగా వ్యవహరిస్తున్న తీరులో రహస్యం ఏమీ లేదు. అది చంద్రబాబు నాయుడుపై కక్షో.... ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్‌పై కక్షో అర్ధం కావడం లేదు. మోదీకి భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ అనే రాష్ట్రం ఉన్న భావన కలగడం లేదు.

విభజన వల్ల ఘోర అన్యాయానికి, వివక్షకు గురైన ఆంధ్రప్రదేశ్‌కు ఓ పదేళ్ళపాటు 'ప్రత్యేకహోదా' సదుపాయం కల్పించి, ఆర్థికంగా పెద్ద ఉపశమనం కలిగించి, రాష్ట్రాన్ని ఆదుకుంటామని అప్పటి బీజేపీ ప్రధాని అభ్యర్థి మోదీ తిరుపతి బహిరంగ సభలో వాగ్దానం చేశారు. ఇప్పుడు– 'ప్రత్యేకహోదా' అనే మాటను ఉచ్చరించడానికే రాష్ట్రంలోని పాలక, ప్రతిపక్ష పార్టీలు భయపడే పరిస్థితిని తీసుకువచ్చారు.



ఢిల్లీని మించిన రాజధానిని ఆంధ్రులకు ఏర్పాటు చేస్తామని మోదీ వాగ్దానం చేశారు. ఇప్పుడు, అసలు రాజధానే లేకుండా చేయడంలో వెనుక నుంచి చేయవలసినదంతా చేశారు. పోలవరం నిర్మాణం 100 శాతం కేంద్రానిదే బాధ్యత అని అప్పుడు అన్నారు. ఇప్పుడు రాష్ట్రానిదే బాధ్యత అంటున్నారు. విశాఖలో రైల్వే జోన్ అన్నారు. దాని ఊసు లేకుండా చేశారు. తెలుగువారి యాజమాన్యంలో నడుస్తున్న గంగవరం, కృష్ణపట్నం ఓడరేవులను కన్ను మూసి తెరిచేంత వ్యవధిలో గుజరాతీయుల పరం చేశారు. రాష్ట్రంలోని పాల వ్యాపారం గుజరాత్‌లోని అమూల్ పరమైపోయింది.




ఇక, మిగిలింది వైజాగ్ స్టీల్ ప్లాంట్. ఇది మామూలుగానో లేదా కేంద్రం యాధృచ్ఛికంగానో..., యధాలాపంగానో ఏర్పాటు చేసిన ఫ్యాక్టరీ కాదు. తెలుగువారి మనోభావాలతో పెనవేసుకుపోయి ఉన్న ఒక సుందర స్వప్నం.

దీనికోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన ఉద్యమాలలో 32 మంది ప్రాణాలు కోల్పోయారు. విశాఖకు చెందిన గాంధేయవాది తెన్నేటి విశ్వనాధం మహాశయుడు ఉక్కు ఉద్యమానికి నాయకత్వం వహించారు. అమృతరావు 'విశాఖ ఉక్కు –ఆంధ్రుల హక్కు' నినాదంతో 1966లోనే 21 రోజుల పాటు నిరాహారదీక్ష చేశారు. ఆయన నిలువెత్తు విగ్రహం స్టీల్ ప్లాంట్ టౌన్‌షిప్ ఆవరణలో ఉంది. ఇప్పటికీ ఆయన జన్మదినమైన అక్టోబర్ 20న ఫ్యాక్టరీ యాజమాన్యం తరపున ఆయన విగ్రహానికి పూలమాల వేసి, ఆయన త్యాగాన్ని స్మరించుకుంటూ ఉంటారు. ఈ ఫ్యాక్టరీ కోసమని కురుపాం జమీందారులు సుమారు ఆరువేల ఎకరాలను విరాళంగా ఇచ్చారు. మొత్తం 33 వేల ఎకరాల భూమి ఈ ఫ్యాక్టరీకి ఉంది.సుమారు 16,500 మంది ఉద్యోగులు ఈ ఉక్కు కర్మాగారంలో పనిచేస్తున్నారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు డిమాండ్ చేసినప్పటికీ తీరప్రాంత నగరంగా విశాఖ నగరానికి ఉన్న ప్రత్యేకతలు దృష్టిలో పెట్టుకుని, విశాఖలో ఈ ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటుకు అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ 1970 ఏప్రిల్ 17న నిర్ణయం తీసుకున్నారు. ఈ ఉక్కు ఫ్యాక్టరీకి ఇంత చరిత్ర, ప్రత్యేకత, విశిష్టత ఉన్నందువల్లనే ప్రధాని మోదీ చూపు దీనిపై పడింది. ఆంధ్రులకు ఇది లేకుండా చేయాలని, ఏ గుజారాతీకో దీనిని కట్టబెట్టి తెలుగువారిపై తన కక్ష తీర్చుకోవాలని ఆయన నిర్ణయించిన భావన కలుగుతోంది. ఆయన ఒకసారి ఏదైనా నిర్ణయిస్తే... ఆయన మాట ఇక ఆయనే వినరని చెప్పడానికి ఢిల్లీలో గత 9 నెలలుగా జరుగుతున్న రైతుల ఆందోళన ఒక సజీవ ఉదాహరణ. పంటల ఉత్పత్తులకు 'కనీస మద్దతు ధర' ప్రస్తావన లేకుండా రైతులు తమ ఉత్పత్తులను దేశంలో ఎక్కడైనా అమ్ముకోవచ్చు అంటూ కేంద్రం చేసిన చట్టాల్లో 'కనీస మద్దతు ధర' కూడా ప్రస్తావించాలని కోరుతూ రైతులు గత తొమ్మిది నెలలుగా రోడ్లమీదే జీవనం సాగిస్తున్నారు. కేంద్రంలో చలనం లేదు. అదీ మోదీ ఆలోచనా విధానం. ఇప్పుడు వైజాగ్ స్టీల్ ఫ్యాక్టరీని ఆంధ్రులకు కాకుండా చేయాలని ఆయన నిర్ణయించుకున్నారు.

నిజానికి, సర్వం త్యాగం చేసైనా ఈ కర్మాగారం ప్రైవేట్ పరం కాకుండా చూడాల్సిన చారిత్రిక బాధ్యత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పైన రాజకీయంగా వైసీపీపైన, ప్రతిపక్షమైన తెలుగుదేశం, జనసేన, లోకల్ బీజేపీ, కమ్యూనిస్టు పార్టీలపై ఉంది. కానీ, మన రాజకీయ పార్టీల స్పందన అంతంత మాత్రంగానే ఉన్నదనే భావన ఉత్తరాంధ్ర ప్రజలలో కనిపిస్తున్నది. కేంద్ర నిర్ణయానికి వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజల పోరాటంలో ఈ పార్టీల పాత్ర 'సింబాలిక్'గా కనపడుతున్నది అనే భావం బలంగా వ్యక్తమవుతున్నది. అయినప్పటికీ, ప్రజా క్షేత్రంలో ఎక్కువ నిందను వైసీపీ మోయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో అది అధికారంలో ఉన్నది గనుక. విశాఖపట్నంలో విజయసాయిరెడ్డి చేసిన 'ప్రొటెస్ట్' గానీ, ఢిల్లీ జంతర్ మంతర్‌లో జరుగుతున్న విశాఖ వాసుల ఆందోళనలో ఆయన ప్రసంగాలు గానీ సమస్య తీవ్రతకు అద్దం పట్టేవిగా లేవు. ముఖ్యమంత్రి జగన్ ఈ విషయమై ప్రధానికి లేఖ రాశారని విజయసాయి అంటున్నారు. లేఖలతో అయ్యే పని కాదు కదా ఇది. విశాఖ స్టీల్ ఫ్యాక్టరీని 100 శాతం అమ్మేస్తామని, ఆ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభం అయిపోయిందని కూడా పార్లమెంట్‌లో కేంద్రం ప్రకటించింది.

"మేం అమ్ముతాం. ఏం చేసుకుంటారో చేసుకోండి..." అన్నట్టుగా ఉన్న కేంద్రం వైఖరి పట్ల వైసీపీ గనుక ఇప్పుడు వ్యవహరిస్తున్న తీరునే కొనసాగిస్తే 2024 ఎన్నికల్లో గడ్డు పరిస్థితిని ఎదుర్కొనాల్సి రావచ్చు. మిగిలిన పార్టీలకు పెద్దగా పోయేది ఏమీ లేదు.పోతే గీతే వైసీపీకి పరువు పోవచ్చు. ఈ ఫ్యాక్టరీ ప్రైవేట్ పరం అయిపోయిన రోజున ప్రజల ముందు వైసీపీ ఒక దోషిగా నిలబడవలసి రావచ్చు. లక్షలాది ప్రజల అంతరంగాలు మౌనంగా ఘోషిస్తాయి.

**- భోగాది వేంకట రాయుడు**

bv rayudu @ YouTube

## పేదల ఇంట
# విద్యాజ్యోతులు వెలిగిస్తున్న జగనన్న



- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

జగనన్న విద్యాదీవెన పథకం ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఇంట విద్యాజ్యోతులు వెలిగిస్తున్నారని విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్, ప్రముఖ వైకాపా నాయకుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఇటీవలే రెండోవిడత ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను తల్లుల ఖాతాలో జమ చేయడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి జగన్‌కు తన కృతజ్ఞతలు తెలిపారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ మన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించిన మహత్తరమైన పథకం జగనన్న విద్యాదీవెన పథకం విద్యార్థులకు ఒక వరమని ఆయన అంటూ, ఈ పథకం ద్వారా పేద విద్యార్థులందరికీ ఉన్నత విద్యను అందించడమే ముఖ్యమంత్రి ధ్యేయమన్నారు. తల్లుల ఖాతాల్లో ఈ నగదును జమ చేయడం ద్వారా పిల్లలు చదువుతున్న కాలేజీకు తల్లిదండ్రులే స్వయంగా వెళ్ళి ఫీజులు కట్టడంతో పాటు ఆ కళాశాల పరిస్థితిని, పిల్లలకు అక్కడ అందుతున్న సదుపాయాలను తెలుసుకోవచ్చన్నారు. రాబోయే విద్యా సంవత్సరానికి మేనేజ్‌మెంట్ సీట్లు కూడా ప్రభుత్వ కౌన్సిలింగ్ ద్వారా జరపాలన్న నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. దీని వల్ల ప్రతిభ కలిగిన విద్యార్థులు మంచి కళాశాలలో సీటు పొందేందుకు అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.




# ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేయండి

**-- నుడా ఛైర్మన్‌ను కోరిన వైజీఎస్ బీఏ సభ్యులు --**



గూడూరు పట్టణంలో షటిల్ బాడ్మింటన్‌కు ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు కృషి చేయాలని నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్‌ను ది యంగ్ గూడూర్ షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు కోరారు. ఈనెల 3వతేదీ గూడూరు ఆర్యవైశ్య యువసేన నాయకులు, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ పాలకమండలి అధ్యక్షులు, ది యంగ్ గూడూర్ షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గాధంశెట్టి గిరిబాబు గుప్తా, జిల్లా చంద్రశేఖర్‌లు నెల్లూరులో నుడా ఛైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్ హెడ్‌క్వార్టర్స్ అయినప్పటికీ గూడూరు పట్టణంలో షటిల్ ఇండోర్ స్టేడియం లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన పక్కనే ఉన్న నుడా కార్యదర్శి వై.ఓబులేశునందన్ మాట్లాడుతూ వైజీఎస్‌బీఏ సభ్యులు ఈ విషయాన్ని అనేకసార్లు తన దృష్టికి తీసుకొచ్చారని నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్‌కు తెలిపారు. దీనికి స్పందించిన ఆయన అధికారుల సహకారంతో ఇండోర్ స్టేడియంకు స్థలం కేటాయించేం దుకు కృషి చేస్తామన్నారు. క్రీడల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపిస్తారన్నారు. త్వరలోనే గూడూరు పట్టణ షటిల్ క్రీడాకారుల ఆకాంక్షను తీరుస్తామన్నారు. అంతకుముందు వైజీఎస్ బీఏ ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి గిరిబాబు, చంద్రశేఖర్‌లు నుడా ఛైర్మన్‌కు బొకే అందించి శాలువా కప్పి సన్మానించారు.

## కమిషనర్‌గా
# శ్రీకాంత్ బాధ్యతలు



రాష్ట్ర ప్రభుత్వం సాధారణ బదిలీల్లో భాగంగా ఈ నెల 2న గూడూరు పురపాలక కమిషనర్‌గా శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో మచిలీపట్నం అర్బన్ డెవలప్మెంట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని, సమస్యలను వెంటనే పరిష్కరిస్తామన్నారు.

# రైల్వే ఉద్యోగి కుటుంబానికి సాయం

గూడూరు పట్టణంలోని రైల్వేస్టేషన్ ప్రాంగణంలో సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ నాయకుల ఆధ్వర్యంలో సంఘ సమావేశాన్ని ఈ నెల 3వ తేదీ నిర్వహించారు. ఇటీవల మృతి చెందిన ట్రాక్‌మెన్ పి.రమణయ్య కుటుంబసభ్యులకు యూనియన్ ఆధ్వర్యంలో రూ. 2లక్షల చెక్కును అందజేశారు. నాయకులు శ్రీనివాసులు, నాగరాజు, వెంకటేశ్వరరావు, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.



తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన ఉపాధిహామీ పనుల పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ తెదేపా నాయకులతో కలిసి ధర్నా నిర్వహిస్తున్న మాజీఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్




ఈ నెల 3న విజయవాడలోని ఏపి స్టేట్ సీడ్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్‌పర్సన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న పేర్నాటి హేమ సుష్మిత.

# స్నేహబంధం.. మధురమైన అనుబంధం

## ● వాసవి క్లబ్ ఆధ్వర్యంలో 'ఫ్రెండ్‌షిప్ డే'



స్నేహబంధం ఎంతో మధురమైనదని, అది ఏనాటికీ మరువలేని అనుబంధమని అంటూ స్నేహితుల దినోత్సవం (ఫ్రెండ్‌షిప్ డే)ను ఘనంగా నిర్వహించుకున్నారు. ఆటపాటలతో సరదాగా గడిపి ఫ్రెండ్‌షిప్ డేని సంతోష భరితం చేసుకున్నారు. బుచ్చిరెడ్డిపాళెం వాసవి క్లబ్ అధ్యక్షుడు తిరువీధి రాధాకృష్ణయ్య ఆధ్వర్యంలో ఈనెల 1న నెల్లూరు సమీపంలోని నరసింహకొండపై ఈ వేడుక ఎంతో కోలాహలంగా జరిగింది. ఆర్యవైశ్యులు ఎంతోమంది తమ కుటుంబాలతో సహా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దలకు, పిల్లలకు క్విజ్‌పోటీలు పెట్టి విజేతలకు బహుమతులందించారు. మండల ఆర్యవైశ్యసంఘం అధ్యక్షుడు దరిశి మాలకొండయ్య, వాసవి క్లబ్ ప్రతినిధులు సొల్లేటి ప్రభాకర్, బి.సుబ్బారావు, ఉపాధ్యాయులు ఇమ్మడిశెట్టి గోవిందయ్య, వెంకటేశ్వర్లు, వెంకటరమణ, గాదంశెట్టి శ్రీనివాసులు, దరిశి హరినారాయణలతో పాటు అనేకమంది వైశ్యకుటుంబాల వారు పాల్గొన్నారు.

# కరోనా పట్ల అవగాహన పెంచాలి



కరోనా మహమ్మారి వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన పెంచాలని, ప్రతి ఒక్కరూ కరోనా నివారణకు ముమ్మరంగా కృషి చేయాలని నెల్లూరులోని అల్లూరి సీతారామరాజు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు రమాదేవి అన్నారు. ఈనెల 1న నగరంలోని మూలాపేటలో ఉన్న శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయం ప్రాంతంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ కరోనా పట్ల అవగాహన కల్పించడమనేది ఒక ఉద్యమంలా కొనసాగాలని అకాంక్షించారు. నెహ్రూ యువకేంద్ర జిల్లా కో-ఆర్డినేటర్ మహేంద్రరెడ్డి మాట్లాడుతూ కరోనా నివారణకు తప్పనిసరిగా మాస్కు ధరించాలని, కోవిడ్ నిబంధనలను పాటించాలని అన్నారు. జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, రూడ్స్ సంస్థ ఛైర్మెన్ రసూల్, సుబాన్, నారాయణ, రాజేష్, మన్సూర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరుకళలమ్మ వారి ఆలయానికి వచ్చిన భక్తులకు, స్థానిక ప్రజలకు వారు మాస్కులు పంపిణీ చేశారు.

# గ్రామాలను చక్కగా తీర్చిదిద్దుకోవాలి

## ● కొత్త సర్పంచ్‌లకు ఉన్నతాధికారుల సూచన

ప్రజలచే ఎన్నుకోబడిన గ్రామసర్పంచ్‌లు ఆ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాలని, గ్రామాల అభ్యున్నతే ధ్యేయంగా పని చేయాలని జిల్లా పంచాయతి అధికారి ఎం.ధన లక్ష్మి, జడ్పీ సిఇఓ పి.సుశీల సూచించారు. జిల్లాలోని పలు గ్రామాల సర్పంచ్‌లకు నెల్లూరులో జరిగిన మూడవ విడత శిక్షణ కార్యక్రమం ముగిసిన సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలు చేపడుతోందన్నారు. ఆ పథకాలను సద్వినియోగం చేసుకుని గ్రామాల అభ్యున్నతిని సాధించాలన్నారు. గ్రామాలకు ప్రభుత్వాలు విడుదల చేసే నిధులను సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. గ్రామాల్లో ఎక్కడా అపరిశుభ్రత లేకుండా పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని, గ్రామాలు పచ్చదనం, పరిశుభ్రతతో కళకళలాడేవిధంగా చూడాలని చెప్పారు. గ్రామాల అభివృద్ధిలో సర్పంచ్‌లదే కీలక పాత్ర అన్నారు. అందరూ శ్రద్ధతో పనిచేసి ఆదర్శ సర్పంచ్‌లుగా మంచిపేరు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటాచలం, విడవలూరు, నెల్లూరు రూరల్, విడవలూరు మండలాలకు చెందిన నూతన సర్పంచ్‌లతో పాటు కోవూరు, విడవలూరు ఎండిఓలు శ్రీహరి, చిరంజీవి పాల్గొని సర్పంచ్‌లకు శిక్షణ నిర్వహించారు. వారికి పాలనాపరమైన సలహాలు సూచనలు ఇచ్చారు.



# శాకంబరి అలంకారంలో.. గంగపట్నం చాముండేశ్వరిదేవి



ఆషాఢమాసం ఆదివారం విశిష్టతను పురస్కరించుకుని జిల్లాలో ఎంతో ప్రసిద్ధమైన గంగపట్నం చాముండేశ్వరిదేవి అమ్మవారికి ఆలయ అర్చకులు శోభాయమానంగా శాకంబరి అలంకారం నిర్వహించి విశేష పూజలు చేశారు. భక్తులు ఆలయానికి తరలివచ్చి శాకంబరిగా కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకున్నారు. కొలపర్తి రమేష్‌కుమార్-సుమలక్ష్మి దంపతులు ఈ వేడుకకు ఉభయకర్తలుగా వ్యవహరించారు. దండిగుంట శరత్‌నాయుడు, ఫణీంద్ర తదితరులు పర్యవేక్షించారు.

# కోనలో నిత్యాన్నదానానికి లక్షా వెయ్యిన్నూటపదహార్లు

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాపూరు మండలంలోని పెంచలకోన శ్రీ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పొదలకూరుకు చెందిన దాతలు మర్రి శ్రీనివాసులు -హైమవతి, పెంచలయశ్వంత్‌లు ఇటీవల లక్షా వెయ్యిన్నూట పదహారు రూపాయలను వితరణగా అందజేసి స్వామివారిపై తమ భక్తిని చాటుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వెంకటసుబ్బయ్యకు ఆ విరాళం అందజేయగా దాతలను ఆయన సాగతించి స్వామివార్లకు పూజలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

# దుర్గమ్మ తల్లికి పొంగళ్ళు



ఆషాఢమాసం, మూడవ ఆదివారం రోజున ఎంతోకాలం నుంచి ఆనవాయితీగా వస్తున్న ఆచారం ప్రకారం మనుబోలు మండలంలోని యాచవరం గ్రామంలోని పంటపొలాల్లో వెలసివున్న గ్రామదేవత దుర్గమ్మతల్లి గుడికి గ్రామస్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. మహిళలు పొంగళ్ళ సామగ్రినంతా గంపల్లో పెట్టుకుని వచ్చి అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కుబడులు తీర్చుకున్నారు. కరోనా మహమ్మారిని తరిమికొట్టి ప్రజలను కాపాడాని ప్రార్థిస్తూ అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న అంకమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకు కూడా కన్నులపండువగా అలంకారాలు నిర్వహించి పూజలు చేశారు.

# అరుదైన దివ్యక్షేత్రం..కొత్తూరు శ్రీ సాయిబాబా దేవాలయం

**షిరిడీ సాయి కోట్లాదిమంది భక్తులకు ఇలవేల్పు. దేశవ్యాప్తంగానే కాదు ప్రపంచ వ్యాప్తంగా శ్రీ షిరిడీ సాయిబాబాకు ఎన్నో అపురూపమైన దేవాలయాలున్నాయి. ఎందరో భక్తులు, దాతలు శ్రీ సాయినాధుని దేవాలయాలను నిర్మించి భక్తలోకానికి అందజేసి తరించారు. అలాంటి ఆలయాల్లో ఎంతో అద్వితీయమైన శ్రీ సాయి దేవాలయం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలంలోని కొత్తూరు గ్రామంలో వెలసి ఉంది. కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా, భక్తుల ఆర్తిని బాపే దైవంగా శ్రీ సాయినాధుడు ఇక్కడ కొలువై ఉన్నాడు. కళ్ళు చెదిరిపోయే నిర్మాణశైలితో నిర్మితమైన ఈ ఆలయం జిల్లాలోనే కాదు దేశంలోనే బహు అరుదైన సాయినాధుని దివ్యక్షేత్రంగా ప్రసిద్ధి. ఎంతో ఘనమైన ఈ ఆలయ నిర్మాణం వెనుక ఆసక్తికరమైన చరిత్ర కూడా ఉంది.**

కొత్తూరు సాయిబాబా దేవాలయం జిల్లాలోని సాయిభక్తులందరికీ ఎంతో సుపరిచితమైనదే. ప్రతినిత్యం జిల్లాలోని ఎందరో భక్తులు ఇక్కడికి వచ్చి శ్రీ సాయినాధుని ఎంతో భక్తి శ్రద్ధలతో దర్శించుకుంటూ ఉంటారు. నిత్యం సాయి దివ్య నామం మార్మోగుతూ ఉండే క్షేత్రమిది. వాస్తవానికి కొత్తూరు చాలా చిన్న గ్రామం. కానీ రెండు పెద్ద దేవాలయాల నిర్మాణంతో ఈ గ్రామం జిల్లా ఆధ్యాత్మిక రంగంలో తనదంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. భగవద్భక్తులు, మహాదాతలైన కలికి కోదండరామిరెడ్డి-కలికి శ్రీలత దంపతులు కోట్లాది రూపాయల వ్యయంతో ఇక్కడ ఓ బృహత్తరమైన శ్రీ సాయినాధుని దేవాలయం, మహత్తరమైన శ్రీ యోగాంజనేయస్వామి దేవాలయాలను నిర్మించి కొత్తూరు గ్రామాన్ని ఓ మంచి ఆధ్యాత్మిక క్షేత్రంగా రూపుదిద్దారు. పచ్చని పంటపొలాలు.. గ్రామంలోని సుప్రశాంతమైన వాతావరణం ఈ దివ్యమందిరాలకు మరింత శోభను చేకూర్చుతుంటాయి.








### కలికి దంపతుల కల సాకారం :

నెల్లూరీయుడు, ప్రస్తుతం బెంగుళూరు నివాసి అయిన కలికి కోదండరామరెడ్డి సతీమణి కలికి శ్రీలత పుట్టినిల్లు కొత్తూరు. ప్రముఖ పారిశ్రామికవేత్తగా రాణిస్తున్న కోదండరామిరెడ్డి మనసులో ఇక్కడ సాయినాధునికి ఒక దివ్యమైన ఆలయాన్ని కట్టించాలనే సంకల్పం కలిగింది. కొంతమంది ఆప్తులు, ఆత్మీయుల సహాయ సహకారాలతో, ఆ సాయినాధుని దివ్యాశీస్సులతో ఆలయ నిర్మాణం ప్రారంభం కావడం, ఆలయం ఒక అపురూపమైన దేవాలయంగా నిర్మితం కావడం అంతా ఆ దైవేచ్ఛ. దాదాపు అర ఎకరా స్థలంలో విశాలమైన దేవాలయం ప్రాంగణం, రమణీయమైన శిల్పాకృతులు, అన్నిటికీ మించి షిరిడీలోని శ్రీ సాయినాధుని మూర్తిని రూపుదిద్దిన శిల్పి వంశస్థులతోనే ఇక్కడ కూడా ప్రత్యేకంగా తయారుచేయించిన బాబా విగ్రహమూర్తి జీవకళ ఉట్టిపడుతూ అందరినీ బాగా ఆకట్టుకుంటోంది. దాదాపు అయిదున్నర అడుగుల ఎత్తులో, విశాలమైన మందిరంలో నిర్మించిన శ్రీ సాయిదేవుని ఏకశిలా విగ్రహమూర్తిని ఎంతసేపు చూసినా ఇంకా చూడాలన్నంత ఆకర్షణీయంగా ఉంటుంది. 2008వ సంవత్సరంలో సర్వాంగ సుందరంగా ఈ ఆలయ నిర్మాణం పూర్తయింది. ఎట్టకేలకు కలికి దంపతుల కల సాకారమైంది. కొత్తూరు మెయిన్‌రోడ్డులోనే ఒకవైపు బాబా ఆలయం, ఆ తర్వాత మరోవైపున శ్రీ యోగాంజనేయస్వామి దేవాలయం.. ఈ రెండు అపురూపమైన దేవాలయాలు కొత్తూరుకు కొత్త శోభను చేకూర్చుతున్నాయి.

### నవ వర్ణాలతో..నవగ్రహ మండపం :

ఆలయం పైభాగంలో వివిధ దేవతామూర్తుల విగ్రహాలు, బాబా మందిరానికి ఎడమ వైపున విఘ్నేశ్వరస్వామి, కుడివైపున రాఘవేంద్రస్వామి మందిరాలు ఎంతో ఆకట్టుకుంటూ ఉంటాయి. భక్తులు ధ్యానం చేసుకునేందుకు వీలుగా ఎంతో ప్రశాంతమైన వాతావరణంలో నిర్మించిన ధ్యానమందిరం మరో ప్రత్యేకత. వీటన్నిటికీ మించి తొమ్మిది రంగులతో ఆలయ ప్రాంగణంలో నవగ్రహ మండపాన్ని ఎంతో రమణీయంగా రూపుదిద్దారు. వివిధ ప్రాంతాల నుంచి ఎంతో శ్రమించి సేకరించి తెచ్చిన నవ వర్ణాల శిలలపై చెక్కిన నవగ్రహ మండపం బహుశా దేశంలో మరెక్కడా లేకపోవచ్చు కూడా. దత్తావతారస్వరూపుడు, కరుణామయుడు, ప్రేమస్వరూపుడు.. భక్తవరదుడైన శ్రీ సాయిబాబాకు ఇక్కడ ప్రతిఏటా ఏప్రిల్ 18 నుంచి 22వతేది వరకు అయిదురోజుల పాటు జరిగే బ్రహ్మోత్సవాల వైభవం చెప్పనలవి కాదు. రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి సాయిభక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని శ్రీ సాయినాధుని కృపకు పాత్రులవుతుంటారు. ఏదేమైనా..ఈ ఆలయంలో ప్రతి అణువును ఆధ్యాత్మిక భక్తిభావంతో రూపుదిద్ది దాతలు తమ జీవితాలను పునీతం చేసుకున్నారు. కొత్తూరును ఆధ్యాత్మిక ప్రాంతంగా తీర్చిదిద్ది కలికి దంపతులు అందరి ప్రశంసలందుకుంటున్నారు.

గ్రంథ సమీక్ష

# వ్యక్తిత్వ వికాసం ప్రభోదించే 'వరప్రసాద'ం.. 'శాంతి పథం'

పోరాటపటిమను స్వంతం చేసుకొంటే ఏ రంగంలోనైనా అద్భుత విజయాలు సాధించవచ్చు అన్న స్ఫూర్తివంతమైన సందేశం వరప్రసాదరెడ్డిది. సామాన్యుడికి ప్రేరణనిచ్చి విజయాలకు నిచ్చెన వేయాలనే తపనపడే మహోన్నత వ్యక్తిత్వం ఆయనది!

నేను జీనియస్‌ను కాదు, ఎప్పుడూ కాలేజీలోను, యూనివర్సిటీలోనూ ఫస్ట్ రాలేదు. కానీ మార్గదర్శకులే లేని కొత్త రంగంలో అకుంఠిత విజయాల్ని సాధించడానికి కారణం పోరాటపటిమేనంటూ... 'శాంతి పథం – నన్ను ప్రభావితం చేసిన వ్యక్తులు' శీర్షికన వెలువరించిన బృహత్తర గ్రంథం ద్వారా ఉద్బోధిస్తారు.

అపూర్వమైన విజయాల్ని కైవసం చేసుకొన్న వ్యక్తి విజయగాథ ఇది. పాఠకుణ్ణి ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. సమాజానికి మార్గదర్శనం చేస్తుంది.

సాహిత్యం యొక్క ప్రధానోద్దేశం మనిషిని ముందుకు నడిపించడం, సమాజాన్ని సంస్కరించడం, ఉన్నతమైన భావాల్ని మేల్కొల్పడం. ఆ లక్షణాల కాంతులు వెదజల్లే ఈ విశిష్ట రచన జన బాహుళ్యానికి మేలుకొలుపు.

తెలుగు నేలన నెల్లూరుజిల్లా పల్లెప్రాంతంలో వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఓ యువకుడు, జీవసాంకేతిక శాస్త్రాలను మేళవించి అంతర్జాతీయ కంపెనీల్ని అధిగమించే స్థాయిలో ప్రాణాంతక వ్యాధి హెపటైటిస్–బి వ్యాక్సిన్‌ను అతితక్కువ ధరతో సామాన్యుడికి అందుబాటులో రూపొందించిన వరప్రసాదరెడ్డి ఘనతర చరితకు దర్పణం ఈ పుస్తకం. ఇది వ్యక్తిత్వ వికాస గ్రంథం.

కొంతమంది వ్యక్తులు దగ్గరకు వెళ్ళేకొద్దీ సుగుణాలతో భాసిస్తారు, అలాంటి గొప్ప వ్యక్తి వరప్రసాద్‌రెడ్డి అంటారు రచయిత ఎస్.వి.సురేష్. ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వరప్రసాద్‌లో ఓ సౌజన్యశీలిని దర్శించిన సంఘటన మనకు విశదీకరిస్తారు.

పరిశ్రమ నడపడం తేలిక కాదు, నిజాయితీగా అసలే వీలుకాదన్న వ్యాఖ్య వరప్రసాద్‌లో కసి పెంచింది. అమెరికన్ ప్రతినిధులు మనల్ని 'బెగ్గర్స్' అన్న మాటతో గుండె మండిపోయింది. ఈ సంఘటనల నేపథ్యమే వరప్రసాద్ అవిశ్రాంత కృషితో సాధించిన హెపటైటిస్–బి వ్యాక్సిన్. ఓ కాల్పనిక కథా వస్తువుగా, కమర్షియల్ సినిమాహీరోలా అత్యంత క్లిష్టమైన వ్యాక్సిన్‌ను సాధించిన నిజ జీవిత కథానాయకుడు వరప్రసాద్‌రెడ్డి.

ప్రతి మలుపు గెలుపుగా, అవరోధాల్ని అవకాశంగా భావిస్తూ పోరాటం సలిపి విజయాల్ని కైవసం చేసుకున్న సామాన్యుడు, అసామాన్యుడిగా కృషి సల్పిన కర్తవ్యనిర్వహణా యజ్ఞాన్ని మనకు నేర్పుతుంది. 'శాంతి పథం' జనవాహినిని లక్ష్యం వైపుకు పరుగులు పెట్టిస్తుంది.

అమ్మ పెట్టిన మహూర్తంతోనే అగ్రగణ్యుడిగా, పద్మభూషణుడిగా వినుతికెక్కిన వరప్రసాద్‌రెడ్డి తన ప్రతి అడుగులోనూ అమ్మను స్మరిస్తూ, దర్శిస్తూ



'శాంతా బయోటెక్నిక్స్' అమ్మ చూపుల దివ్యక్షేత్రంగా తీర్చిదిద్దారు. తనకు ప్రేరణ నింపిన తొలి వ్యక్తిగా అమ్మకు మోకరిల్లుతారు.

అమ్మకు అమ్మై పుడితే తప్ప అమ్మ ఋణం తీర్చుకోలేమన్న వరప్రసాదరెడ్డిని తల్లి శాంతమ్మే విలువలున్న వ్యక్తిగా, కార్యసాధకుడిగా తీర్చిదిద్దింది. దాంతో అమ్మపై అనురాగామృతం కురిపిస్తారు వరప్రసాద్‌రెడ్డి. అమ్మపై ప్రేమకు ఆయన పరాకాష్ట అయిన వైనం వర్తమాన సమాజానికి కనువిప్పు కాగలదనడంలో సందేహం లేదు.

అలాగే తనపై ప్రభావం చూపిన నాన్నపైన ప్రేమామృతం వర్షించారాయన, నాన్న మనసు వెన్న అంటూ, పనివాళ్ళను సైతం ప్రేమగా చూసే సంస్కార హృదయాన్ని నాన్నలో దర్శించారాయన. నాన్నకు దేవుడంటే అచంచల విశ్వాసం, అలాగే నా శక్తిసామర్థ్యాల మీద అపారమైన నమ్మకం అంటారు వినమ్రంగా వరప్రసాదరెడ్డి. వ్యాపార రంగంలో అడుగిడుతున్న నా అభిమతాన్ని స్వాగతించిన మహా ధైర్యవంతుడు మా నాన్న అంటూ ఆయనలోని గొప్ప గుణాల్ని కీర్తిస్తారు.

వరప్రసాదరెడ్డిని మరింతగా ప్రభావితం చేసి, జీవననైపుణ్యాలు, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలు నేర్పిన వ్యక్తి మేనమామ గండవరం సేతు రామిరెడ్డి. కమ్యూనిస్టు పార్టీకి నిఖార్సయిన నేత. గొప్ప విలువలతో ఆదర్శనీయమైన జీవనం సాగించారాయన. ఆయనంటే నెల్లూరీయులకు ఎనలేని గౌరవం ఉండేది. బడి రోజుల్నుంచి ప్రపంచంలో అడుగిడేదాకా సేతురామిరెడ్డి వ్యక్తిత్వ ప్రభావంతో తాను కూడా పేదల పట్ల మానవతా వాదాన్ని ప్రదర్శించగల్గానని చెప్తారు వరప్రసాదరెడ్డి.

అమ్మ మాటతో కమతగాడు వెంకటయ్య కాళ్ళకు నమస్కరిస్తాడు వరప్రసాదరెడ్డి, పాలేర్లను పరాయిగా చూసే లోకంలో శాంతమ్మతల్లి కొడుకు చేత దణ్ణం పెట్టించడం ఆమె హృదయ ఔన్నత్యానికి నిదర్శనం. 'వర'ప్రసాదరెడ్డి ఈ సంఘటనను చెప్పిన తీరుతో వెంకటయ్యను చూడాలనే ఆసక్తి మనకూ కలుగుతుంది. ఆ ఫోటో లేకపోవడంతో చిన్న డ్రాయింగ్‌లో అతని ఫోటో కన్పిస్తుంది.

గురువు అనే మాధ్యమం లేకపోతే జ్ఞాన కిరణాలు మనసు దరిని చేరవంటారు వరప్రసాద్. ఆర్ఎస్ ఆర్ఎమ్ స్కూల్లోని కంటే పాపయ్యను పుంభావ సరస్వతిగా భావించి తెలుగుపై తాను ఇష్టాన్ని పెంచుకొన్న సంఘటన, వర్మ గారు నేర్పిన లెక్కలు ప్రాణం పోసుకొని సజీవరూపం దాల్చిన సంఘటన కళ్ళకు కట్టినట్లు చెప్పారాయన. విఎస్ రామచంద్రరావు మాస్టారు చేతి వ్రాతకు తన్మయుడైనానని, మనసు నిండాలంటే కవిత్వం చదవాలన్న విద్వాన్ కణ్వశ్రీ ప్రభావమేనని చెప్తారు.

తాను భర్త స్థానం నుంచి పక్కకు వచ్చి తన జీవిత భాగస్వామి వసంతపై నిష్పాక్షిక సమీక్ష చేయగల్గడం ఆయనకే చెల్లింది. పెద్దగా చదువుకోని పల్లెటూరి అమ్మాయి వసంత, తాను శాంతా బయోటెక్నిక్స్ వ్యవహారాల్లో తలమునకలైనప్పుడు అన్ని పనులూ తానై నిర్వహించి అద్భుతాలు చేసిందని అబ్బురపడతారు వరప్రసాదరెడ్డి. తన మనసు చూరగొన్న ఆమె పట్ల ఆసక్తిగా చెప్తారాయన. ఎన్నో నిర్ణయాలు స్వయంగా తీసుకొని కుటుంబానికి వసంతం తెచ్చిందని ఆ మహాఇల్లాలి పట్ల అనురాగాన్ని వ్యక్తీకరిస్తారాయన.

తెలుగువారి ఆధ్యాత్మిక జీవన దిక్సూచి బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రావీణ్యత వరప్రసాదరెడ్డిని ఎంతగానో ఆకట్టుకొంది. ఆ ప్రవచనాలు తననెంతగానో ప్రభావితం చేశాయంటారాయన.


జీవితమంటే తల్లిదండ్రులు, తోబుట్టువులే కాదు, మన సంతానంతో సాంగత్యమే కాదు – వీటన్నింటిని మించిన కొన్ని స్నేహాలు చిగురిస్తాయి. రక్తసంబంధం లేకున్నా అవి అంతకుమించిన బంధాన్ని పెనవేస్తాయంటారు వరప్రసాద్‌రెడ్డి. ఆ బాంధవ్యాన్ని దైవమిచ్చిన విజయవాడ పేరెంట్స్‌లో చూస్తారాయన. ఇది ఆయన సహృదయతకు నిదర్శనం.

మానవత్వం పరిమళించిన సుబ్బారావు దంపతుల్ని, వారి విశాల దృక్పధాన్ని గాఢంగా హత్తుకొని దైవమిచ్చిన తల్లిదండ్రులుగా భావించడం, వారు లేకుండా పెళ్లి చేసుకోనన్న ఆత్మీయత పెంచుకొన్న గొప్ప మనస్వి వరప్రసాదరెడ్డి. ఇలాంటి అరుదైన వ్యక్తిత్వానికి జేజేలు పలకవల్సిందే!

పాఠశాల స్థాయి నుంచి తనను ప్రభావితం చేసిన ముగ్గురు వ్యక్తులు శంకర నారాయణ, డా॥ కె.ఎన్.ఎన్.ప్రసాద్, అల్లు అరవింద్‌లతో పెనవేసుకొన్న గాఢ స్నేహబంధాన్ని నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. ఇది వరప్రసాదరెడ్డి స్నేహాభిలాషకు తార్కాణం. స్నేహాన్ని అజరామరంగా భావించే భావుకతకు ఆయన సన్నిధి పెన్నిధి!

అక్షర ప్రయోగాలతో సాహితీ ప్రస్థానం చేస్తున్న బాపూ రమణల పట్ల అవ్యాజానురాగం వరప్రసాద్‌కు. రమణ గారి రాత బాపుగారి గీత అంటే ప్రాణం. ఎవరికో సాయం చేసి సొంత ఇంటిని రమణ కోల్పోతే, బాపూ తన ఇంటిపై ఇల్లు కట్టుకోమన్న అపూర్వ స్నేహద్వయం తననెంతగానో ప్రభావితం చేసిందంటారు వరప్రసాద్‌రెడ్డి.

ప్రముఖ గాయకుడు ఎస్‌పి బాలసుబ్రహ్మణ్యంతో తన స్నేహ ఉషస్సును ఒడలు మరచి ఆరాధిస్తారాయన. ఆ ప్రజ్ఞాయశస్వితో స్నేహం ఎలా చిగురించిందో, ఎలా పల్లవించిందో అది ప్రణవనాదమై ఎలా సాగిందో మనతో సంతోష సంభ్రమంగా ఆవిష్కరిస్తారు వరప్రసాదరెడ్డి. బాలు పాటలోనే కాదు హృదయంలోనూ మాధుర్యం ఉందంటారాయన.




**రచన : డా. కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి**
**వెల : రూ. 200/- పేజీలు : 157**
**ప్రతులకు:**
**నవోదయ బుక్‌హౌస్**
**ఆర్యసమాజ మందిర్ ఎదురుగా, కాచీగూడ, హైదరాబాదు. ఫోన్. 040 - 24652387**

శాంత – వసంత ట్రస్టు ప్రారంభించాక వందలాది పుస్తకాల్ని ప్రచురించిన వరప్రసాద్‌రెడ్డి తనకు అమితంగా నచ్చి విశేషంగా ప్రభావితం చేసిన పుస్తకాలు 'నాకూ ఉంది ఓ కల', 'విరాట్' అంటారు. మొదటి పుస్తకం ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా మజిలీలను గుర్తు చేస్తే, రెండో పుస్తకం విరాట్, విరాట్ స్వరూపంతో తన ఆలోచనా ధోరణి, దృక్పథంపై ప్రగాఢ ప్రభావం చూపిందంటారు.

విజేతల జీవనంలో వారిని ప్రభావితం చేసిన అనేక అంశాలు అందరికీ మార్గదర్శకమై సజీవ స్ఫూర్తిని కల్గిస్తాయి. ఆ మార్గదర్శక కథనమే 'శాంతి పథం'. ఇలాంటి గొప్ప అనుభవాల్ని గ్రంథస్థం చేసిన వరప్రసాదరెడ్డి అభినందనీయులు. ఈ పుస్తకం వివిధ సందర్భాలలో కానుకగా ఇవ్వగలిగే విలువైన రచన. ఈ రచన అందించిన పద్మభూషణుడు నెల్లూరీయుడు కావడం మనం చేసుకున్న అదృష్టం!

తనికెళ్ళ భరణి ముందు మాటలో అన్నట్లు వరప్రసాదరెడ్డి పక్క నుంచి వెళ్తుంటే సంగీత సాహిత్యాల సుకుమార ధ్వనులు వినిపిస్తాయి. ఇంకా చెప్పాలంటే ఆయన ప్రతి వాక్యంలో సాహిత్య తృష్ణ ద్యోతకమవుతుంది.



సమీక్ష : చిన్ని నారాయణరావు
9440202942

## డాక్టర్ పిఎల్ రావు కుటుంబాన్ని
# పరామర్శించిన మంత్రి అనిల్



ప్రముఖ నేత్రవైద్యుడు డాక్టర్ పిఎల్ రావు కుటుంబాన్ని ఇటీవల రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ పి. అనిల్‌కుమార్‌యాదవ్ పరామర్శించారు. నెల్లూరులో కంటివైద్య నిపుణునిగా పేరొందిన మోడరన్ ఐ హాస్పిటల్ గ్రూప్ సంస్థల ఛైర్మెన్ డాక్టర్ పిఎల్ రావు గత నెల 26న మరణించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మంత్రి అనిల్ పొగతోటలోని వారి నివాసానికి వెళ్ళి పిఎల్ రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డా.పిఎల్ రావు సతీమణి డాక్టర్ భారతి, కుమార్తె డాక్టర్ చిన్మయి, అల్లుడు డాక్టర్ విష్ణుతేజలను పరామర్శించి వారికి తన ప్రగాఢ సంతాపం తెలిపారు. మంత్రి వెంట నుడా ఛైర్మెన్ ముక్కాల ద్వారకనాథ్, వైకాపా యువజన నాయకుడు రూప్‌కుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాలకు పక్షవాతం

(మొదటి పేజీ తరువాయి)

దూకుడు తప్ప వ్యవహారంలో పస లేదన్న విషయం కూడా తేటతెల్లమైపోయింది. ఫామ్‌హౌస్‌లో కామ్‌గా కూర్చోవడమే ఆయనకు మంచిదని ఆయన అభిమానులే సలహా ఇస్తున్నారట. కామ్రేడ్లని కలుపుకుని రాష్ట్రాన్ని ఏలేస్తానని పవన్ కంటున్న కలలు కలలుగానే మిగిలిపోవాల్సిందే నన్నది వారి అభిప్రాయం.

కామ్రేడ్లు కూడా అటూ ఇటూ కాని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నారు. వాళ్ళు ఎప్పుడు ఎవరితో కలిసినా వాళ్ళకు వీళ్ళవల్లో లేక వీళ్ళకు వాళ్ళవల్లో కొంత ప్రయోజనం చేకూరేది. కానీ ఇప్పుడు ఎవరు ఎవరితో చెయ్యి కలిపినా ఎవరికీ లాభం లేదన్న విషయం కామ్రేడ్లకు కూడా అర్థమైపోయింది.

ఒకప్పుడు ప్రతిపక్షాలంటే బలంగా ఉండేవి. వ్యూహాత్మకంగా వ్యవహరించేవి. ఇప్పుడా పరిస్థితే లేదు. అత్యధిక సంఖ్యా బలంతో పరిపాలన సాగిస్తున్న జగన్ మోహన్‌రెడ్డి ముందు ఎలాంటి ప్రతిపక్షమూ నిలిచే అవకాశమే లేదు. జగనన్న అమ్మఒడి, జగనన్న చేదోడు, జగనన్న తోడు, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన, జగనన్న విద్యా కానుక, జగనన్న కాలనీలు, వైయస్ఆర్ కాపు నేస్తం, వైయస్ఆర్ మత్స్యకార నేస్తం, వైయస్ఆర్ రైతు భరోసా ఇలా చెప్పుకుంటూ వెళ్తే ఇంకా 30కిపైగా సంక్షేమ పథకాలు ప్రజల ముంగిళ్ళలో ఆవిష్కరించారు ముఖ్యమంత్రి జగన్. వచ్చే రోజులలో జరిగే ఏ ఎన్నికలలో అయినా ఓట్లు అడిగే వాళ్ళు ఉపన్యాసాలు దంచనక్కర లేదు... ఈ పథకాల పేర్లన్నీ ఒక గంట సేపు వరుసగా చదివి వినిపిస్తే చాలు ఓట్లు వాటంతట ఆవే వచ్చి బ్యాలట్ బాక్సులలో పడిపోతాయి.

నవరత్నాలతో మొదలుపెట్టిన ఈ పథకాల పథకమే జగన్‌మోహన్‌రెడ్డిని హీరోను చేసేసింది. ప్రతిపక్ష పార్టీలకు పక్షవాతం తెప్పించి వారి నోళ్ళు మూయించేసింది. వాళ్ళ కాళ్ళనూ చేతులనూ కట్టేసి పక్షవాతం వచ్చిన ప్రతిపక్షాలుగా పడుకోపెట్టేసింది. మొత్తానికి ఈ పథకాల పథకం మంచి ఫలితాన్నే ఇచ్చింది. గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో ప్రతిపక్షాలను నిర్వీర్యం చేసేసింది.

# ఉపాధి బిల్లులు చెల్లించకపోవడం బాధాకరం

## టిడిపి నాయకుడు అబ్దుల్ అజీజ్ ఆవేదన




ఉపాధి హామీ పనులు చేసిన వారికి రెండేళ్ళు గడిచినా బిల్లులు చెల్లించ కుండా ప్రభుత్వం ఇంకా కాలయాపన చేస్తుండడం దారుణమంటూ టిడిపి నాయకుడు అబ్దుల్ అజీజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈనెల 2న ఆయన కావలి ఆర్డీఓ కార్యాలయం వద్ద జరిగిన ధర్నాందోళనలో పాల్గొని మాట్లాడుతూ ఉపాధి హామీ బిల్లులు చెల్లించేందుకు కేంద్రం వాటాగా 4500 కోట్లు విడుదల చేసిందని, రాష్ట్రప్రభుత్వ వాటాగా 1535 కోట్లతో కలిపి నిధులను విడుదల చేసి పనులు చేసినవారికి చెల్లించాలని కోరారు. ఉపాధి బిల్లులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించకుంటే న్యాయపోరాటం చేస్తామన్నారు. ఉపాధి పనులు చేసిన వారు ఇప్పటికే ఆర్థికంగా చితికిపోయారని, చేసిన అప్పులకు వడ్డీలు కట్టలేక ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నా ప్రభుత్వం కనికరించకపోవడం బాధాకరమంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ శీనానాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ ఆందోళనలో నాయకులు మలిశెట్టి వెంకటేశ్వర్లు, కండ్లగుంట మధుబాబునాయుడు, బీద గిరిధర్, ఏగూరి చంద్రశేఖర్, ప్రసాద్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఆ ఘనత పవన్‌కళ్యాణ్‌దే



జనసేన జిల్లా కార్యాలయంలో ఇటీవల క్రియాశీలక సభ్యత్వ కిట్స్‌ను జిల్లా కమిటీ సభ్యుల సమక్షంలో క్రియశీలక సభ్యులకు అందజేశారు, ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రధానకార్యదర్శి గునుకుల కిషోర్, ఉపాధ్యక్షులు బద్దెపూడి సుధీర్, నగర నాయకులు సుజయ్‌బాబు మాట్లాడారు. జనసేన అధ్యక్షులు పవన్‌కళ్యాణ్ ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన క్రియాశీలక సభ్యత్వ నమోదు నెల్లూరు నగరంలో దాదాపు 1100 మందితో పూర్తి చేయటం శుభప్రదమని, ఈ కార్యక్రమం ఇంతటి విజయం సాధించడానికి జిల్లా అధ్యక్షులు చెన్నారెడ్డి మనుక్రాంత్ కార్యదక్షతే కారణమనీ తెలిపారు. తన వ్యక్తిగత సంపాదన నుంచి కార్యకర్తల శ్రేయస్సు నిమిత్తం కోట్ల రూపాయలు ఇచ్చిన ఘనత జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌దేననీ, ఈ సభ్యత్వంతో పాటు సభ్యులకు ఇచ్చిన భీమా సౌకర్యంతో ప్రమాదం జరినపుడు, వైద్యం నిమిత్తం రూ.50000లు ప్రాణహాని జరిగినప్పుడు కుటుంబసభ్యులకు రూ.500000 ఇస్తూ పార్టీ తరపున భరోసా కల్పిస్తున్నామన్నారు. దేశంలో మరే రాజకీయ పార్టీల్లో లేని సౌకర్యం జనసేన పార్టీ కలగజేసిందని, రానున్న రోజుల్లో అన్నీ నియోజకవర్గాల్లో క్రియాశీలక సభ్యత్వాలు పూర్తి చేసి బలమైన కమిటీలు ఏర్పరుచుకొని, సామాన్యుడికి అండగా నిలుస్తామనీ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధానకార్యదర్శి గునుకుల కిషోర్, నెల్లూరు నగర నాయకులు సుజయ్‌బాబు, ఉపాధ్యక్షులు, సుధీర్ బద్దిపూడి, నాయకులు మేకల ప్రవీణ్‌కుమార్‌యాదవ్, మున్వర్ భాష, పసుపర్తి కిషోర్, పూసల లక్ష్మిమల్లేశ్వరరావు, ప్రశాంత్‌గౌడ్, లీలామోహన్, సుల్తాన్ బాషా, షాజహాన్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్ళకు అధికార యంత్రాంగం సిద్ధం

## • జిల్లాలో 2.66 లక్షల టన్నుల దిగుబడి వస్తుందని అంచనా

జిల్లాలో ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్ళకు జిల్లా అధికారయంత్రాంగం సమాయత్త మవుతోంది. ఆగస్టు రెండవ వారం నుంచి కొనుగోళ్ళు ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో 1.10 లక్షల ఎకరాల్లో రైతులు వరిపంట సాగుచేశారని, అందువల్ల సుమారు 2.66 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి ఉంటుందని అంచనా వేస్తున్నామని కలెక్టర్ చక్రధర్‌బాబు తెలిపారు. ఈనెల 3న కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమై ఈ విషయమై చర్చించారు. ధాన్యం కొనుగోళ్ళలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. జిల్లాలోని అన్ని డివిజన్లలో పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో ధాన్యం సేకరణ కేంద్రాలను ప్రారంభిస్తామని, రైతులు తమ సమీపంలో ఉన్న రైతుభరోసా కేంద్రాల్లో నమోదు చేసుకుని ధాన్యం సేకరణ కేంద్రాల్లో సరైన మద్దతు ధరలకు తమ ధాన్యాన్ని విక్రయించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని, ధాన్యాన్ని దళారుల పాలుచేయకుండా రైతులు ప్రభుత్వం ఏర్పాటుచేస్తున్న కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ విషయంలో రైతులకు ఏమైనా సందేహాలుంటే టోల్‌ఫ్రీ నెంబరు 1077కు ఫోన్ చేసి తగు సలహాలు సూచనలు పొందవచ్చని తెలిపారు.

## చేతివృత్తిదారులకు

# చేయూతనివ్వండి

## విశ్వబ్రాహ్మణ సంఘం నాయకులు

విశ్వబ్రాహ్మణులకు చెందిన చేతివృత్తి దారులైన స్వర్ణకారులు, వడ్రంగులు ఇతర వృత్తుల వారు కరోనా నేపథ్యంలో జీవనోపాధి కోల్పోయి ఎన్నో అవస్తలు పడుతున్నారని, వారికి తగు చేయూతనందించాలని విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఖాజన వెంకటశేషయ్య ఆచారి, పలువురు వైకాపా నాయకులు రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి డాక్టర్ అనిల్‌కుమార్ యాదవ్‌ను కోరారు. ఈనెల 1న నెల్లూరు కామాటివీధిలోని శ్రీకృష్ణమందిరంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆమేరకు సంఘం నాయకులు మంత్రి అనిల్‌కు వినతిపత్రం అందజేశారు. ఇతర చేతి వృత్తులవారికి సాయం అందిస్తున్నట్లుగా విశ్వబ్రాహ్మణ చేతివృత్తిదారులకు కూడా ఏడాదికి 10వేల రూపాయలను ప్రభుత్వం ఆర్థికసాయంగా అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు ఇలపాక శివకుమార్ ఆచారి, శివపురం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# 9న 'సేవ్ ఇండియా'

కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న రైతు వ్యతిరేక కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 9వ తేదీ దేశవ్యాప్తంగా జరుగుతున్న ధర్నాలలో కార్మికులు రైతులు ఉద్యోగ ఉపాధ్యాయ మిత్రులు పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు నెల్లూరు జిల్లా అధ్యక్షులు టివి ప్రసాద్ పిలుపునిచ్చారు చేజర్ల మండలంలో జరిగిన సిఐటియు మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించడం కార్మిక చట్టాలను రద్దు చేయడం నూతన వ్యవసాయ చట్టాలను తీసుకు రావడం లాంటి విధానాలను అమలు పరుస్తూ భారతదేశాన్ని కార్పొరేట్లకు తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు పి.మనోహర్ చేజర్ల మండల నాయకులు దిల్షాద్ రాజేశ్వరి నిర్మల తదితరులు పాల్గొన్నారు

# ఎట్టకేలకు పొగాకు వేలం

జిల్లాలోని డిసి పల్లి పొగాకు వేలం కేంద్రంలో గత 93 రోజులుగా జరుగుతున్న పొగాకు వేలం గతనెల 31 నాటికి ముగిసింది. దాదాపు 65 కోట్ల రూపాయల విలువయ్యే పొగాకు కొనుగోళ్ళు జరిగాయి. వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ ఈ విషయమై విలేకరులకు వివరిస్తూ మార్చి15న పొగాకు వేలం ప్రారంభమైందని, 2013 మంది రైతులు 43,916 పొగాకు బేళ్ళను వేలానికి తీసుకురాగా 65.46 కోట్ల రూపాయల విలువైన పొగాకు కొనుగోళ్ళు జరిగాయని చెప్పారు. ఈ పంట కాలానికి 5.1 మిలియన్ కిలోల పొగాకు దిగుబడి అవుతుందని అంచనా వేసినా వర్షాభావ పరిస్థితుల కారణంగా 4.51 మిలియన్ కిలోలు మాత్రమే దిగుబడి వచ్చిందని, కేజీ పొగాకు సగటు ధర 145.01 రూపాయలు కాగా గరిష్టంగా 170 రూపాయలు, కనిష్టంగా 30 రూపాయల ధర పలికిందని తెలిపారు.

# అర్హులందరికీ 'నేతన్న నేస్తం'

## - జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు



జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికి నేతన్న నేస్తం ప్రయోజనం దక్కేలా చూడాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. 'నేతన్న నేస్తం' లబ్ధిదారుల ఎంపిక పై సంబంధిత అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలో ఇప్పటివరకు నేతన్న నేస్తం పథకం కింద 24 వేల రూపాయలు ఆర్థిక సహాయం కోసం 6060మంది నేతన్నలు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారిలో పాతవారు 5240మంది కాగా, కొత్తవారు 820 మంది ఉన్నారన్నారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులను ప్రభుత్వ నిబంధనల మేరకు నిశితంగా పరిశీలించడం జరుగుతోందని, అందులో ఇప్పటివరకు 421 దరఖాస్తులు వివిధ కారణాల చేత అర్హత లేనివిగా గుర్తించడం జరిగిందన్నారు. సొంతంగా మగ్గం తప్పనిసరిగా కలిగి ఉండి నేత నేస్తుండేవారు పథకం పొందేందుకు అర్హులని స్పష్టం చేశారు. అర్హతలేని దరఖాస్తులను తిరస్కరించే ముందుగా మరలా ఎలాంటి ఫిర్యాదులు రాకుండా క్షేత్రస్థాయిలో మరోసారి క్షుణ్ణంగా పరిశీలన జరపాలన్నారు. ఇందుకోసం ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు, చేనేత అధికారులు, గ్రామ, వార్డు వాలంటీర్లతో బృందాలను ఏర్పాటు చేసి వారంలోగా తనిఖీలు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో సంయుక్త కలెక్టర్ గణేష్‌కుమార్, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఆనంద్‌కుమార్, జడ్పీ సీఈవో శ్రీమతి సుశీల, ఏడిఓలు ప్రసాదరావు, వెంకటరావు, డివోలు వెంకటేశ్వర్లు, విజయబాబు పాల్గొన్నారు.

# నిందితులను పట్టేశాం

## నెల్లూరు రూరల్ డిఎస్పి



గత నెల 30వ తేదీ రాత్రి నెల్లూరుజిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలం, జొన్నవాడలో అపహరణకు గురైన బాలిక మద్దిల అఖిలజ్యోతి అపహరణ కేసును పోలీసులు చేధించారు. అపహరణకు పాల్పడింది స్వయానా బాలిక తల్లేనని నిర్ధారణ అయింది. ప్రియుడితో కలిసి వచ్చిన తల్లి బాలికను అపహరించింది. దీనిపై బాలిక నాన్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన బుచ్చి పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి జైలుకు పంపారు. నెల్లూరు రూరల్ డిఎస్పీ హరినాథరెడ్డి ఈ కేసుకు సంబంధించి వివరాలను ఈ నెల 3వ తేదీన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. డిఎస్పీ కథనం మేరకు... జొన్నవాడకు చెందిన మద్దిల మస్తాన్–నాగలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. నాలుగేళ్ల క్రితం భార్యా భర్తలు విడిపోయారు. భార్య నాగలక్ష్మి నెల్లూరుకు చెందిన అల్తాఫ్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తూ జీవనోపాధి కోసం విజయవాడలో ఉంటోంది. ఇద్దరు పిల్లలు జొన్నవాడలోని నాన్నమ్మ కృష్ణవేణమ్మ వద్ద ఉంటున్నారు. ఈ క్రమంలో గత నెల 30వ తేదీన నాగలక్ష్మి, ఆమె ప్రియుడు అల్తాఫ్ జొన్నవాడలోని కృష్ణవేణమ్మ నివాసానికి వెళ్లి తాము పోలీసులమని బెదిరించి ఇంట్లో ఉన్న బాలిక అఖిల జ్యోతిని ఆటోలో తీసుకెళ్లిపోయారు. నాన్నమ్మ కృష్ణవేణమ్మ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు అపహరణకు పాల్పడింది తల్లి ఆమె ప్రియుడని నిర్ధారించారు. వారిద్దర్నీ అరెస్ట్ చేసి బాలికను నాన్నమ్మకు అప్పగించారు. ఈ సమావేశంలో సిసిఎస్ సిఐ బాజీజాన్ సైదా, బుచ్చి ఎస్సై ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

# కొత్త పన్నుల పేరుతో ప్రజలను పీడిస్తారా?


## • సిపిఐ నాయకుల ఆగ్రహం

కొత్త పన్నుల విధానం పేరుతో ప్రజలను పీడిస్తారా?..ఇదేం న్యాయం అంటూ సిపిఐ జిల్లాశాఖ ఆధ్వర్యంలో ఈనెల 2న ధర్నాందోళన నిర్వహించారు. నెల్లూరులో కార్పొరేషన్ కార్యాలయాన్ని చుట్టుముట్టి దిగ్బంధం చేశారు. దీంతో పోలీసులకు నాయకులకు మధ్య గొడవ, తోపులాట జరగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆందోళనకారులను పోలీసులు బలవంతంగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు ప్రభాకర్, రామరాజు, సిరాజ్ తదితరులు మాట్లాడుతూ పన్నుల పేరుతో ప్రజలను పీడించి డబ్బు గుంజడమే ధ్యేయంగా జగన్ ప్రభుత్వం పనిచేస్తోందని విమర్శించారు. ఏఐవైఎఫ్, సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రాణాలను కాపాడే 'ఆయుష్-64'

## - పార్లమెంట్‌లో ఆదాల ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం

కరోనా మహమ్మారికి విరుగుడుగా సంప్రదాయ వైద్యమైన ఆయుష్-64 మందు గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు ఎంతవరకు సురక్షితమైనదని నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి ఇటీవల పార్లమెంట్‌లో ప్రశ్నించారు. ఈ మందు మంచి ఫలితాలను ఇస్తే అంతర్జాతీయంగా దీనిని ప్రోత్సహించేందుకు ఏమైనా ప్రణాళికలున్నాయా అని కూడా అడిగారు. అందుకు కేంద్ర ఆయుష్‌మంత్రి సర్బానంద సోనోవాల్ జవాబు చెప్తూ శాస్త్రీయ పరిశోధనల తర్వాత కోవిడ్ మహమ్మారిని రూపుమాపేందుకు ఆయుష్-64 ఒక ముఖ్యమైన మందుగా పరిగణించామని, ఇది మనుషుల ప్రాణాలు కాపాడే మంచి ఔషధం అని ఆయన స్పష్టం చేశారు.



ఆయుష్-64 మందు మహిళల ఆరోగ్యాన్ని కాపాడుతున్నట్లు అనేక పరిశోధనల్లో తేలిందన్నారు. ఈ మందును తయారు చేసేందుకు ముందుకు వచ్చిన కంపెనీలకు ఒక ఒప్పందం ద్వారా సాంకేతికతను బదిలీ చేశామన్నారు. అవసరమనుకుంటే శిక్షణ కూడా ఇస్తామన్నారు.

### సబ్సిడీ బియ్యం ఏమేరకు ఇచ్చారు?

గరీబ్ కల్యాణ్ యోజన కింద ఆంధ్రప్రదేశ్‌కి ఈ ఏడాది జులై-నవంబర్ నెలల్లో ఏమేరకు సబ్సిడీ బియ్యాన్ని కేటాయించారని ఆదాల ప్రశ్నించగా, కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి రాతపూర్వకంగా సమాధానమిస్తూ 198.78 లక్షల మెట్రిక్ టన్నుల ఆహారధాన్యాలను రాష్ట్రానికి కేటాయించామన్నారు. జులై-నవంబర్ నెలలకు 6,70,552.58 మెట్రిక్ టన్నులను కేటాయించగా, 2,466.90 కోట్ల సబ్సిడీ లభించిందని, మే-జూన్ నెలల్లో 268223.23 మెట్రిక్ టన్నులను కేటాయించామని, అందుకు కేంద్రం 986.77 కోట్ల రూపాయల సబ్సిడీ అందించిందని కూడా తెలిపారు.



## నేతలను కలిసిన జిల్లా రవాణా కమిషనర్

నెల్లూరు జిల్లా రవాణా కమిషనర్‌గా గత గురువారం జులై 29వ తేదీ బాధ్యతలు చేపట్టిన బి.చందర్ జిల్లాలోని పలువురు నేతలను కలుసుకున్నారు. పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి, నీళ్ళ మంత్రి అనిల్‌యాదవ్‌తో పాటు మాజీమంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిలను ఆయన గౌరవ పూర్వకంగా కలుసుకున్నారు.

# వైయస్ దూరదృష్టికి నిదర్శనం.. శ్రీసిటీ

### ఏపిఐడిసి అధ్యక్షురాలు




దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రారంభించబడిన శ్రీసిటీ ఆ మహానేత దూరదృష్టికి నిదర్శనంగా నిలుస్తుందని, శ్రీసిటీలో అనేక పరిశ్రమలు పెట్టుబడులు పెట్టడంతో పాటు, దాదాపు 50వేల మందికి పైగానే ఇక్కడ జీవనోపాధి కల్పిస్తుండడం అభినందనీయమని రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ(ఏపిఐడిసి) అధ్యక్షురాలు బండి శివశక్తి నాగేంద్ర పుణ్యశీల అన్నారు. ఈనెల 4న శ్రీసిటీని సందర్శించి మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంలో ఇలాంటి మెగా ఇండస్ట్రియల్ పార్కును అభివృద్ధి చేయడానికి శ్రీసిటీ యాజమాన్యం తీసుకుంటున్న చర్యలను ఆమె ప్రశంసించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ ఏపిఐడిసి అధ్యక్షురాలి పర్యటన తాము గౌరవప్రదంగా భావిస్తున్నామన్నారు. ఏపిఐడిసి జాయింట్ డైరెక్టర్ టి.మురళి, సహాయ జనరల్ మేనేజర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీసిటీ చిన్మయ విద్యార్థుల ప్రతిభ

శ్రీసిటీలోని చిన్మయ విద్యాలయం విద్యార్థులు సిబిఎస్ఇ పదవతరగతిలో మంచి ఫలితాలు సాధించారు. ఈ పాఠశాల నుంచి 23 మంది పరీక్షలు రాశారని, అందరూ ఉత్తీర్ణులయ్యారని, వీరిలో 11 మంది డిస్టింక్షన్ సాధించారని, మరో 10 మంది ఫస్ట్‌క్లాస్, ఇద్దరు సెకండ్‌క్లాస్‌లో పాసయ్యారని, తమ పాఠశాల వరుసగా అయిదవ సారి నూటికి నూరుశాతం ఫలితాలు సాధించిందని ఆ విద్యాలయం ప్రిన్సిపాల్ భువనేశ్వరి తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, పాఠశాల ప్రిన్సిపాల్‌ను, టీచర్లను శ్రీసిటీ ఎం.డి రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు.




జననం : 01.02.1959 మరణం : 26.07.2021

స్వర్గీయ డా॥ పి.యల్.రావు గారు

(డా॥ పాబోలు లక్ష్మణరావు గారు) MS(Ophthal)

ఛైర్మెన్, మాడరన్ గ్రూప్ ఆఫ్ 'ఐ' హాస్పిటల్స్

## అమృతమూర్తికి అశ్రునివాళి

చెరగని చిరునవ్వుకు చిరునామా మీ రూపం
దేదీప్యమానమై వెలుగుతుంది మీ ఆశయ దీపం.
నేత్ర వైద్య రంగంలో అజరామరమైనది మీ కీర్తి
నిస్వార్థ సేవలలో నిరుపమానమైనది మీ స్ఫూర్తి.

ఆప్యాయతానురాగాలను మాకు పంచి
మార్గదర్శిగా ఉజ్వల భవిష్యత్తును అందించిన మీరు
మాకిక లేరనే నిజాన్ని నమ్మలేకున్నాం.
మీ పవిత్ర ఆత్మకు శాంతి ప్రసాదించమని
భగవంతుని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...

భార్య : డా॥ భారతి

కుమార్తె - అల్లుడు :

డా॥ చిన్మయి - డా॥ గోనుగుంట విష్ణుతేజ

మనుమరాలు : గోనుగుంట సత్య శ్రీరామ వైష్ణవి

కుటుంబసభ్యులు మరియు సిబ్బంది

MODERN EYE HOSPITAL A MISSION FOR VISION

మాడరన్ గ్రూప్ ఆఫ్ 'ఐ' హాస్పిటల్స్

నెల్లూరు । చిత్తూరు । విజయవాడ । గుంటూరు । ఒంగోలు

వైకుంఠ సమారాధన : తేది. 11.08.2021, బుధవారం నెల్లూరు పొగతోటలోని మా స్వగృహమునందు జరుగును. కావున తెలియజేయడమైనది.


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com